ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
గురువారం 15 మే 2025


తోటల్లో కాయలను ఏరుతున్న కూలీలు

మామిడి జాతర


మంచి కలర్ ఉన్న కాయలు


యార్డులో కాయలను గ్రేడింగ్ చేస్తున్న దృశ్యం

- తోటల్లోనే కాయల గ్రేడింగ్, లోడింగ్
- కోడూరులో వ్యాపారుల మకాం
- ఇక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి

రైల్వేకోడూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరులో మామిడి జాతర మొదలైంది. ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు ఇక్కడే మకాం వేసి తోటల్లోనే కాయలను గ్రేడింగ్ చేసిన లారీలకు లోడింగ్ చేసి ఇతర రాష్ట్రాలకు పంపుతున్నారు. మామిడి సీజన్ మొదలు కాగానే గుత్తి, గుంతకల్లు, ఆళ్లగడ్డ, నంద్యాల, కర్నూలు, తాడిపత్రి, అనంతపురం తదితర ప్రాంతాలకు చెందిన సుమారు 2 వేల మంది కూలీలు రైల్వేకోడూరులో దాదాపు రెండు నెలల పాటు మకాం వేసి జీవనోపాధి పొందుతారు. తోటల్లోనే కూలీలకు భోజనాలు ఏర్పాటు చేస్తారు. అదేకాకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన మార్వాడీలు (వ్యాపారులు) రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పుల్లంపేట, పెనగలూరు తదితర ప్రాంతాల్లో ఉన్న మామిడి రైతులతో ఒప్పందాలు కుదుర్చుకుని తోటల్లోనే కాయలు కోతలు చేయించి వాటిని గ్రేడింగ్ చేయించుకుని అక్కడే లోడింగ్ చేసుకుని ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు చేస్తున్నారు. కొందరు తోటల నుంచి పంపుతుండగా మరికొందరు మార్కెట్ మండీకి తరలింపు అక్కడే గ్రేడింగ్ చేసి ఇతర రాష్ట్రాలకు పంపుతున్నారు. ఇటు మార్కెట్‌కు అటు జ్యూస్ పరిశ్రమలకు ఎగుమతి చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌కు పంపే కాయల ధరలు బాగానే ఉన్నాయని, జ్యూస్‌కు పంపే కాయల ధరలు తగ్గించారని రైతులు అంటున్నారు. మార్కెట్‌కు పంపే పులిహోరా కాయలు టన్ను రూ.20 వేల నుంచి రూ.28 వేలు, తోతాపూరి టన్ను రూ.18 వేల నుంచి రూ.20 వేలు, రుమాణి టన్ను రూ.11 వేల నుంచి రూ.20 వేలు, బేనీషా టన్ను రూ.30 వేల నుంచి రూ.35 వేలు, ఖాదర్ టన్ను రూ.40 వేల నుంచి రూ.45 వేలు, మల్లికా టన్ను రూ.40 వేల నుంచి రూ.45 వేలు, నాటు రకాలు టన్ను రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు ధరలు పలుకుతున్నాయి. చిత్తూరు, తిరుపతిలో ఉన్న జూస్ ఫ్యాక్టరీలకు ఎక్కువగా తోతాపూరి, పులిహోరా తదితర కాయలను తరలిస్తున్నారు. జ్యూస్‌కు పంపే కాయలు తక్కువ ధరలు నిర్ణయించారని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు మామిడికి అనుకూలించలేదు. పలు దఫాలుగా వర్షాలు కురవడంతో మామిడి పంట దెబ్బతింది. ఈ ఏడాది కేవలం పది శాతం మేరకు కాపు నిలిచింది. కొన్ని తోటల్లోనే ఎక్కువ కాపు నిలిచింది. కొన్ని తోటల్లో అసలే కాపు లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. ఇక్కడి కొందరు రైతులు, వ్యాపారులు మహారాష్ట్ర, కేరళ, కర్ణాటక, ఆదిలాబాద్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, కశ్మీర్, పంజాబ్ తదితర నగరాలకు కోడూరు మామిడి కాయలను ఎగుమతి చేస్తున్నారు.


కోడూరు మార్కెట్ యార్డు వద్ద భారీగా రాసిపోసిన వివిధ రకాల మామిడి కాయలు

రెండు నెలల పాటు రైల్వేకోడూరులోనే ఉంటాం...



రెండు నెలల పాటు రైల్వేకోడూరులో మకాం చేస్తాం. మామిడి తోటలను ముందుగా పరిశీలించి నాణ్యతను బట్టి రైతులతో ఒప్పందాలు కుదుర్చుకుంటాం. కాయ సైజు, రంగు రాగానే కోతలు ప్రారంభిస్తాం. తోటల్లోనే కాయల కోత ప్రారంభించి, అక్కడ గ్రేడింగ్ చేసుకుని, లోడింగ్ చేసుకుని ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నాము.

- బాబూభాయ్, కేఎల్ సర్వాన్,
ఆదిలాబాద్, కేరళకు చెందిన వ్యాపారులు


సమావేశంలో మాట్లాడుతున్న క్వాలిటీ కంట్రోల్ ఈఈ శంకరయ్య

పనుల్లో నాణ్యత లోపిస్తే ఇంటికే

- క్వాలిటీ కంట్రోల్ ఈఈ శంకరయ్య

పీలేరు రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ పనులలో నాణ్యత కొరవడితే సంబంధిత అధికారులు, సిబ్బంది ఇంటికేనని తిరుపతి క్వాలిటీ కంట్రోల్ ఈఈ శంకరయ్య హెచ్చరించారు. బుధవారం పీలేరు పంచాయతీరాజ్ డీఈ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా జరిగిన ప్రతి పనిలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ఒత్తిళ్లకు భయపడి నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వంలో పూర్తయిన గ్రామ, వార్డు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్, సిమెంట్ రోడ్లకు క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికెట్ తప్పనిసరి అని చెప్పారు. ఇంతవరకూ ఎవరైనా క్యూసీ తీసుకోనట్లయితే వెంటనే తీసుకుని ఫైనల్ బిల్లులు అప్‌లోడ్ చేయాలని సూచించారు. పీలేరు నియోజకవర్గంలో ఇప్పటి వరకు జరిగిన భవనాలు, రోడ్ల పరిశీలన శుక్రవారం నుంచి క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీ చేస్తారని చెప్పారు. క్షేత్ర స్థాయిలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నపుడు తప్పనిసరిగా ఇంజనీరింగ్ అసిస్టెంట్లు అక్కడే ఉండి పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. పీలేరు, వాల్మీకిపురం, కలికిరి, కేవీపల్లె, గుర్రంకొండ, కలకడ మండలాల్లో జరిగిన అన్ని పనులను క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీ చేయనున్నారు. సమావేశంలో డీఈ మధుసూదన్, ఏఈలు రామక్రిష్ణనాయక్, ప్రసాద్, సుబ్రత్, హబీబ్, కమలాకర్‌రెడ్డి, విజయ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వైసీపీకి షాక్

- పురందేశ్వరి, మంత్రి సత్యకుమార్ సమక్షంలో బీజేపీలో చేరిక
- జిల్లా రాజకీయాల్లో కుదుపు
- ఎమ్మెల్సీ జకియాఖానం రాజీనామా



(రాయచోటి-ఆంధ్రజ్యోతి): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి గట్టి దెబ్బ తగిలింది. శాసన మండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియాఖానం తన పదవికి, వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి బుధవారం రాజీనామా చేశారు. వెంటనే బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సంఘటన ఒక్కసారిగా జిల్లా రాజకీయాల్లో కుదుపు రేపింది. రాయచోటి పట్టణానికి చెందిన అఫ్జల్ అలీఖాన్ మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వెంట నడిచారు. దీంతో కాంగ్రెస్ పాలనలో ఈయనకు రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని కట్టబెట్టారు. వైఎస్ మరణానంతరం ఈయన జగన్‌తో పాటు వైసీపీలో చేరి పార్టీలో క్రియాశీలకంగా పని చేశారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానాన్ని ధిక్కరించి ఓదార్పు యాత్ర చేపట్టిన వైఎస్ జగన్ రాయచోటికి వచ్చినపుడు అఫ్జల్‌ఖాన్ ఇంట్లో బసచేశారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన రెండు నెలల తర్వాత అఫ్జల్‌ఖాన్ గుండెపోటుతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో అప్పటి నుంచి సామాన్య గృహిణిగా ఉన్న జకియాఖానంను పదవులు వరించాయి. ఎవరూ ఊహించని రీతిలో ఈమెకు జగన్ ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చారు. తర్వాత శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ పదవి ఖాళీ కావడంతో ఆ పదవిని సైతం ఈమెకు కట్టబెట్టారు. అఫ్జల్‌ఖాన్ సోదరుడు ఆసిఫ్‌ఖాన్ రాయచోటి మున్సిపాలిటీ కౌన్సిలర్‌గా వైసీపీ తరపున గెలుపొందారు. ఈయన కూడా గత సంవత్సరం గుండెపోటుతో చనిపోయారు. శాసన మండలి డిప్యూటీ చైర్‌పర్సన్ హోదాలో ఉన్నప్పటికీ ఆమె స్థానిక పార్టీ నాయకత్వంపై కినుక వహించారు. తనకు పదవి ఇచ్చారే కానీ నియోజకవర్గంలో తన మాటకు ఎటువంటి విలువ లేకుండా అధికారం ఇవ్వలేదనే అసంతృప్తి ఆమెలో ఉండేది. ఈ నేపథ్యంలో 2024 ఎన్నికల్లో ఆమె పార్టీ మారతారనే ప్రచారం జోరుగా సాగింది. అయితే ఎన్నికలకు ఆరు నెలల ముందు జరిగిన ఆమె కుమారుడి వివాహానికి ముఖ్యమంత్రి హోదాలో జగన్ మోహన్‌రెడ్డి హాజరయ్యారు. దీంతో సమస్య అంతా సద్దుమణిగినట్లే అని అందరూ అనుకున్నారు. ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం తర్వాత ఆమె వైసీపీకి దూరంగా ఉంటూ వచ్చారు. కూటమి ప్రభుత్వంతో సన్నిహిత సంబంధాలు కొనసాగించారు. ఈ నేపథ్యంలోనే ఆమె తిరుమల తిరుపతి దేవస్థానం దర్శనం టికెట్లు అమ్ముకున్నారనే ఆరోపణలపై కేసు నమోదైంది. అయితే తాను ఏ తప్పు చేయలేదని ఆమె ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆమె వైసీపీ పార్టీ కార్యక్రమాలకు, సమావేశాలకు పూర్తి దూరంగా ఉంటూ వచ్చారు. గతంలో మంత్రి నారా లోకేశ్‌ను కలవడంతో ఆమె టీడీపీలో చేరతారని అందరూ ఊహించారు. అయితే ఎవరూ ఊహించని విధంగా వైసీపీకి షాక్ ఇస్తూ ఎమ్మెల్సీ పదవి మరో సంవత్సరం గడువు ఉన్నప్పటికీ ఆ పదవికి రాజీనామా చేశారు. వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి సైతం రాజీనామా చేశారు. బుధవారం ఉదయం ఆమె తన రాజీనామా లేఖను శాసనమండలి చైర్‌పర్సన్‌కు పంపించారు. గంటల వ్యవధిలోనే ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, బీజేపీ నాయకుడు నాగోతు రమేశ్‌నాయుడులతో కలిసి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, మంత్రి సత్యకుమార్ సమక్షంలో బీజేపీ కండువా కప్పుకున్నారు. ఈ సంఘటన ఒక్కసారిగా జిల్లా రాజకీయాలను కుదిపేసిందని చెప్పవచ్చు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), మే 14 (ఆంధ్రజ్యోతి): 'దార్తి ఆబా జన్ జాటియ గ్రామ ఉత్కర్ష్ అభియాన్' కార్యక్రమంలో జిల్లాలో ఎంపికైన 4 మండలాల్లోని 17 గ్రామాల్లో జూన్ 15 నుంచి 30వ తేదీ వరకు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయంతో నిర్వహించబడే ఈ కార్యక్రమం పక్కాగా అమలు కావాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో నాలుగు మండలాల్లోని 17 గ్రామాలు ఈ కార్యక్రమం కింద ఎంపికయ్యాయని, ఈ గ్రామాల్లో 50 శాతం పైబడి జనాభా గిరిజనులు ఉన్నట్లు తెలిపారు. ఆధార్‌కార్డు, రేషన్ కార్డు తదితర కార్డులు లేని వారికి కార్డులు అందచేస్తారన్నారు. ఈ గ్రామాల్లో వివిధ శాఖల సమన్వయంతో కేంద్ర ప్రభుత్వ సహాయంతో పక్కా ఇళ్ల నిర్మాణం, జలజీవన్ మిషన్, ఇంటింటికీ విద్యుత్తు, సోలార్ ప్యానల్ నిర్మాణం, జాతీయ హెల్త్ మిషన్, ఉజ్వల యోజన, పోషణ్ అభియాన్, సమగ్ర శిక్ష తదితర పథకాలను అమలు చేయబోతున్నామన్నారు. ఈ అవగాహన కార్యక్రమాలను గిరిజన ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

రేపు అనంతరాజుపేటలో కిసాన్‌మేళా

- 50 రకాల మామిడి కాయల ప్రదర్శన
- ఉద్యాన పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ యువరాజ్



రైల్వేకోడూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతరాజుపేట ఉద్యాన పరిశోధన స్థానంలో ఈనెల 16వ తేదీ కిసాన్‌మేళా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కేఎం యువరాజ్ తెలిపారు. బుధవారం రైల్వేకోడూరులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కిసాన్‌మేళా కార్యక్రమంలో 50 రకాల మామిడి కాయలను ప్రదర్శన చేయనున్నట్లు తెలిపారు. మొత్తం 12 స్టాల్స్ ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. డ్రిప్ ఇరిగేషన్, టిష్యూ కల్చర్, పురుగు మందులు, పనిముట్లు, ఔషధ మొక్కలు, కూరగాయలు తదితరవి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా నుంచి 500 మంది రైతులు వస్తున్నారని వివరించారు. రైతులు పండించిన పంటలను కూడా ప్రదర్శనలో ఉంచుతామని తెలిపారు. నాణ్యమైన మొక్కలు, నిమ్మ, డ్రాగన్‌ఫ్రూట్, సపోటా, జామ, మామిడి అమ్మకాలు కూడా ఉంటాయని తెలిపారు. రైతుల సమస్యలపై శాస్త్రవేత్తలు, అధికారులు వివరిస్తారన్నారు. కిసాన్ మేళా కార్యక్రమానికి ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ఉద్యాన యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కె.గోపాల్, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ కేటీ రమణ, రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, జిల్లా ఉద్యానశాఖ అధికారులు హాజరవుతారని తెలిపారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగవా.. రామా...!

- ఒంటిమిట్టలో రైళ్లు ఆపాలంటూ వినతులు

6

31 మంది ఎస్ఐల బదిలీ

6

పాలిసెట్‌లో మదనపల్లె విద్యార్థికి జిల్లా ఫస్ట్ ర్యాంకు

ఈసారైనా స్పందిస్తారా..?

- అకాల వర్షాలతో నష్టపోయిన రైతులు
- దాహంతో అల్లాడుతున్న జనం
- గళం విప్పని ప్రజాప్రతినిధులు
- నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం



జిల్లాపరిషత్ కార్యాలయం

జడ్పీ పాలకమండలి సర్వసభ్య సమావేశాన్ని గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నారు. జడ్పీ చైర్మన్‌గా ముత్యాల రామగోవిందరెడ్డి ఇటీవలనే బాధ్యతలు చేపట్టారు. ఈయన ఆధ్వర్యంలో మొదటిసారిగా జడ్పీ సర్వసభ్య సమావేశం జరగనుంది. అధికార, ప్రతిపక్ష ప్రజాప్రతినిధులు పాల్గొంటున్న ఈ సమావేశంలో జిల్లాలో నెలకొన్న సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై ఎంతమేర చర్చ జరుగుతుందనేది ప్రశ్నార్థకంగా మారింది. దాదాపు నాలుగేళ్లుగా జడ్పీ సర్వసభ్య సమావేశాలు మొక్కుబడిగానే సాగుతూ వస్తున్నాయి. ఈసారైనా ప్రజా సమస్యలపై నేతలు గళం విప్పుతారని జనం ఆశగా ఎదురుచూస్తున్నారు.

కడప రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఆధీనంలోని జడ్పీ పాలక మండలి ఇప్పటి వరకు జడ్పీచైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, ఇన్‌చార్జి జడ్పీ చైర్‌పర్సన్ జె.శారద ఆధ్వర్యంలో దాదాపు 16 జడ్పీసర్వ సభ్య సమావేశాలను నిర్వహించారు. ఈ సమావేశాలను అరకొర చర్చలతోనే ముగించేశారు. నేడు ముచ్చటగా మూడవ జడ్పీ చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి ఆధ్వర్యంలో జడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. ఈ నేథప్యంలో జిల్లాలో నెలకొన్న పలు సమస్యలపై చర్చించి పరిష్కారం చూపాలని జనం కోరుతున్నారు.

అకాల వర్షాలతో నష్టం..

జిల్లాలో అకాల వర్షాలు కురుస్తున్నాయి. ఉద్యాన పంటలతో పాటు వ్యవసాయ పంటలకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. ఈ కారణంగా అరటి, బొప్పాయి, మామిడి, మునగ, కర్బూజ, దోస, వరి, నువ్వు తదితర పంటలకు రూ.వందల కోట్లలో నష్టం వాటిల్లింది. బాధిత రైతులు లబోదిబోమంటున్నారు. వీరిని ఆదుకొనేలా చర్చ సాగించాల్సిన అవసరం ఉంది.

దాహం నుంచి గట్టెక్కిస్తారా

ఎండలు మండిపోతున్నాయి. ఆయా ప్రాంతాల్లో 40 నుంచి 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో రోజురోజుకు భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. అటు సాగునీటికి రైతులు ఇబ్బంది పడుతుండగా ఇటు తాగునీటికి ప్రజలు ఇక్కట్ల పాలవుతున్నారు. మరో పక్క

మిగతా 6వ పేజీలో..

సైనిక్ స్కూల్లో అన్ని స్థానిక సీట్లు ఏపీకే

- ఏపీ విద్యార్థులకు గుడ్ న్యూస్



కలికిరి సైనిక్ స్కూల్ ముఖద్వారం

కలికిరి, మే 14 (ఆంధ్రజ్యోతి): కలికిరి సైనిక్ పాఠశాలలో ఈ ఏడాది నుంచి స్థానికతకు సంబంధించి కేటాయించే మొత్తం సీట్లన్నీ ఏపీ విద్యార్థులకు మాత్రమే పరిమితం కానున్నాయి. తెలుగు రాష్ట్రాల విభజన చట్టం మేరకు ఇరు రాష్ట్రాల్లోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నత స్థాయి విద్యా సంస్థల్లో పదేళ్ల వరకు రెండు రాష్ట్రాలకు కలిపి స్థానికత కోటా కింద సీట్లు ఉండేవి. పదేళ్ల నిర్ణీత కాల వ్యవధి ముగిసిపోవడంతో 2025-26 విద్యా సంవత్సరం నుంచి ఏ రాష్ట్రానికి చెందిన విద్యార్థులకు మాత్రం ఆ రాష్ట్రంలో స్థానికత వర్తించనుంది. దీనికి సంబంధించి సోమవారం ఏపీ ప్రభుత్వం వివిధ రాష్ట్రాల్లో వివిధ రీజియన్ల ప్రకారం స్థానికతకు సంబంధించిన అర్హతలను ప్రకటించిన విషయం తెలిసిందే. కలికిరి, కోరుకొండ సైనిక్ స్కూళ్ల ప్రవేశాల్లో 67 శాతం స్థానిక విద్యార్థులకు కేటాయించారు. మిగతా 33 శాతం సీట్లు ఇతర రాష్ట్రాల వారికి (నాన్ లోకల్) కేటాయించారు. ఇప్పటి వరకు ఈ 67 శాతం సీట్లలో తెలంగాణకు కూడా స్థానికత కింద సింహభాగం సీట్లు దక్కేవి. హైదరాబాదులో పేరున్న దాదాపు 10 కోచింగ్ సెంటర్ల కారణంగా ఎక్కువ భాగం సీట్లు తెలంగాణ విద్యార్థులే కైవసం చేసుకునే ఆనవాయితీ ఉండేది. కానీ ఇక నుంచి ఈ మొత్తం సీట్లు ఏపీ విద్యార్థులకే పరిమితం కానున్నాయి. ఈ ఏడాది కలికిరి సైనిక్ స్కూల్లో 6వ తరగతిలో 95 మంది బాలురకు, 10 మంది బాలికలకు కలిపి మొత్తం 105 మందికి ప్రవేశాలు కల్పించనున్నారు. ఇక్కడ స్థానికత కోటా కింద 70 సీట్లు పూర్తిగా ఏపీ విద్యార్థులకే దక్కనున్నాయి. కోరుకొండ సైనిక్ స్కూల్లో 93 మంది బాలురకు ప్రవేశాలున్నాయి. అందులో 67 శాతంతో 64 స్థానికత కోటా సీట్లు మొత్తం కూడా ఏపీకే పరిమితం కానున్నాయి. అంటే మొత్తం 198 సీట్లలో 67 శాతం స్థానికత కోటా కింద 134 సీట్లు ఏపీ విద్యార్థులకు మాత్రమే అందుబాటులోకి రానున్నాయి. తెలంగాణ విద్యార్థులు నాన్ లోకల్ కోటా కింద 33 శాతం సీట్లలో మాత్రమే పోటీ పడాల్సి ఉంటుంది. ఇది కాకుండా తిరుపతిలో ఈ ఏడాది ప్రైవేటు సైనిక్ స్కూల్ ప్రారంభించడానికి అనుమతి లభించింది. ఈ విద్యా సంవత్సరం నుంచే వెరిటాస్ సైనిక్ స్కూల్ పేరుతో దక్షిణ భారతదేశంలో ఒకే ఒక ప్రైవేటు సైనిక్ స్కూల్ ఏర్పాటుకు అవకాశం కలిగింది. దీనివల్ల మరో 90 సీట్లు దాకా కొత్తగా పెరిగే అవకాశాలున్నాయి. ఆ లెక్కన స్థానికత కోటాలో ఇందులో కూడా మరో 60 సీట్లు లభించనున్నాయి. అంటే అన్నీ కలుపుకుంటే రాష్ట్రం మొత్తం మీద కేవలం స్థానికత కోటా కిందే ఏపీ విద్యార్థులకు మొత్తం 290 సీట్లు పైబడి లభించనున్నాయి. గతంలో కోరుకొండ, కలికిరి స్కూళ్లలో మొత్తం కలుపుకుని ఏపీ విద్యార్థులకు 60 సీట్లకు లోబడే ప్రవేశాలు దక్కేవి. ఈ ఏడాది ప్రవేశ పరీక్షలు రాసి ఫలితాల కోసం ఎదురు చూస్తున్న వారిలో ఓ మోస్తరు మెరిట్ విద్యార్థులకు కూడా సీట్లు దక్కే అవకాశాలు ఉంటాయి. కాగా ప్రస్తుతం తెలంగాణలో కనీసం ఒక్క సైనిక్ స్కూల్ కూడా లేదు. రాష్ట్రంలో సైనిక్ స్కూల్ ఏర్పాటయ్యే వరకూ ఏపీ సైనిక్ స్కూళ్లలో స్థానికత కింద తెలంగాణ విద్యార్థులకు అవకాశం పొడిగించాలని ఆ రాష్ట్రానికి చెందిన పలువురు మంత్రులు మంగళవారం డిమాండు చేశారు. అయితే అలాంటి అవకాశాలు మాత్రం లేవని పలువురు ఏపీ నాయకులు స్పష్టం చేస్తున్నారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగవా.. రామా...!

● ఇబ్బందులు పడుతున్న రామ భక్తులు

● ఒంటిమిట్టలో రైళ్లు ఆపాలంటూ వినతులు




ఒంటిమిట్ట రైల్వేస్టేషన్

ఒంటిమిట్ట, మే 14 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రా భద్రాద్రిగా పేరుగాంచిన ఒంటిమిట్టలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగకపోవడంతో రామభక్తులు అవస్థలు పడుతున్నారు. రాష్ట్రం విడిపోవడంతో 2015లో ఒంటిమిట్ట కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం తరపున నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆలయ అభివృద్ధి కొరకు ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయాన్ని టీటీడీలో విలీనం చేసింది. టీటీడీ వారు 100 కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి పనులు చేస్తున్నారు. పలు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఒంటిమిట్ట కోదండరాముడి దర్శనానికి విచ్చేస్తున్నారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ తదితర రాష్ట్రాల నుంచి భక్తులు విచ్చేస్తున్నారు. కానీ ఒంటిమిట్టలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒంటిమిట్ట మీదుగా పలు రాష్ట్రాలకు ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయి. వీటిలో కొన్ని రైళ్లు అయినా ఒంటిమిట్టలో నిలిపితే భక్తులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. ప్రస్తుతం ఒంటిమిట్ట రైల్వేస్టేషన్‌లో అరక్కోణం, హుబ్లీ, డెమో ప్యాసింజర్ రైళ్లు మాత్రమే ఆగుతున్నాయి. దూర ప్రాంతాల నుంచి ఒంటిమిట్ట కోదండరాముడి దర్శనానికి విచ్చేయాలంటే రైళ్ల సౌకర్యం లేకపోవడంతో పలువురు భక్తులు రాలేకపోతున్నారు. ప్రతిరోజూ సుమారు 10 వేల లోపు భక్తులు కోదండరాముడిని దర్శించుకుంటున్నారు. రైళ్ల సౌకర్యం ఏర్పడితే భక్తుల తాకిడి ఇంకా పెరిగే అవకాశం ఉంటుంది. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో జరిగిన కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాలకు ప్రతిరోజూ ఐదు వేలకు మందికి పైగా ఒంటిమిట్టలో ఆగే రైళ్లల్లో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాల్లో రైల్వే శాఖకు సుమారు 1.50 లక్షల రూపాయలు ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. అదే ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఇక్కడ ఆగితే మరింత ఆదాయం వచ్చే అవకాశం ఉందని రైల్వే అధికారులు చెబుతున్నారు. ఒంటిమిట్ట మండలంలో ప్రధానంగా రైతులు చీనీ, నిమ్మ పంటలను సాగు చేస్తున్నారు. ఈ పంటలను రైతులు కేరళ రాష్ట్రంలోని ఎర్నాకులంకు పంపిస్తూ ఉంటారు. వ్యాపార లావాదేవీల కోసం ఇక్కడ రైతులు ఎర్నాకులానికి వెళుతుంటారు. అలాగే చెన్నై, విజయవాడ తదితర ప్రాంతలకు కూడా ఈ పంటను పంపిస్తున్నారు. రైళ్ల స్టాపింగ్ లేకపోవడంతో వీరంతా చాలి ఇబ్బందులు పడుతున్నారు. అలాగే మండలంలో చేనేత కార్మికులు అధిక సంఖ్యలో ఉన్నారు. వీరు చెన్నై, విజయవాడ, హైదరాబాదు, కాకినాడ, విశాఖపట్టణం తదితర ప్రాంతాలకు వ్యాపార నిమిత్తం వెళుతుంటారు. వీరు కూడా ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పది సంవత్సరాలుగా ఒంటిమిట్టలో ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని పలువురు భక్తులు రైల్వేశాఖ అధికారులకు విన్నవించినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఒంటిమిట్టలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేలా చర్యలు తీసుకోవాలని రామ భక్తులు, రైతులు, చేనేత కార్మికులు కోరుతున్నారు.

రాముడి దర్శనం ఎంతోమందికి దక్కుతుంది



ఒంటిమిట్టలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిపితే కోదండరాముని దర్శనం ఎంతోమందికి దక్కుతుంది. రాముడిని దర్శించుకోవాలని ఉన్నా వచ్చేందుకు రైళ్ల సౌకర్యం లేకపోవడంతో దూర ప్రాంత గ్రామ భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళతాము.

- బొబ్బిలి సుబ్బరాయుడు, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి, ఒంటిమిట్ట

భక్తులకు ఇబ్బందులు తప్పుతాయి



ఒంటిమిట్టలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగితే రామ భక్తులకు ఇబ్బంది లేకుండా ఉంటుంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు సౌకర్యవంతంగా ఉంటుంది. రైల్వే అధికారులు దీనిపై దృష్టి సారించి రైళ్లు ఆగేలా చర్యలు తీసుకుంటే బాగుంటుంది.

- వీణా రాఘవాచార్యులు, ఆలయ ప్రధాన అర్చకులు

రైతులకు ఎంతో ఉపయోగం



ఒంటిమిట్టలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగితే మండల రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. కేరళ, చెన్నై, తెలంగాణ తదితర రాష్ట్రాలకు ఇక్కడి రైతులు వ్యాపారం కోసం వెళుతుంటారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు.

- కట్టా యానాదయ్య, జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు

భక్తుల కోసం ఆపాలి



ఒంటిమిట్ట కోదండరామ స్వామిని దర్శించుకునేందుకు విచ్చేసే భక్తుల కోసం ఒంటిమిట్టలో ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలపాలి. రైళ్లు నిలిపితే ప్రతి ఒక్కరికీ సౌకర్యంగా ఉంటుంది. భక్తుల తాకిడి కూడా పెరిగే అవకాశం ఉంటుంది

- ఎస్వీ రమణ, ప్రముఖ కాంట్రాక్టర్, ఒంటిమిట్ట

ఈసారైనా స్పందిస్తారా..?

● అకాల వర్షాలతో నష్టపోయిన రైతులు
● దాహంతో అల్లాడుతున్న జనం
● గళం విప్పని ప్రజాప్రతినిధులు
● నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం

(5వ పేజీ తరువాయి)

మూగజీవాలు దాహంతో అల్లాడుతున్నాయి. పశువుల దాహాన్ని తీర్చేందుకు ఏర్పాటుచేస్తున్న తాగునీటి తొట్లెల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి.

గిట్టుబాటు ధర కల్పిస్తారా..

రబీలో సాగుచేసిన వరి పంటల నూర్పిళ్లు దాదాపు పూర్తై ధాన్యాన్ని రైతులు అమ్ముకుంటున్నారు. పంటకు తగిన గిట్టుబాటు ధర లభించడం లేదని రైతులు వాపోతున్నారు. పైగా వ్యాపారులు తూకంలో దగా చేస్తుండడంతో రైతులు లబోదిబోమంటున్నారు. వీటికి పరిష్కారం చూపాల్సిన గురుతర బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులపై ఉంది.

ఖనిజ దోపిడీని అరికట్టేనా..

జిల్లాలో ఖనిజదోపిడీ యథేచ్ఛగా కొనసాగుతోంది. ముగ్గురాయి, సున్నపురాయి, గ్రావెల్, మట్టి తదితర వాటిని అన్ని పార్టీల వారూ అక్రమంగా తరలిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు. అనుమతులు లేకుండానే కొండలను, గుట్టలను తవ్వి గుల్లచేస్తున్నా అధికారులు చేష్టలుడిగి చూస్తున్నారు. ఈ అక్రమాలకు కళ్లెం వేయాల్సిన అవసరం ఉంది.

శాఖల వారీగా..

● పశుసంవర్ధకశాఖలో పశువైద్యం గాలిలో దీపంలా మారింది. అధికారులు అందుబాటులో ఉండడం లేదని రైతులు వాపోతున్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2024-25కు గాను ఉమ్మడి జిల్లాకు 875 గోకులం షెడ్లను మంజూరు చేసింది. వీటిలో చాలా వరకు అనర్హులు నిర్మించుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పశుగ్రాస విత్తన సరఫరా అంతంతమాత్రమే సాగుతోంది. పెయ్యదూడల సంఖ్య పెంపు గణాంకాలకే పరిమితమవుతోంది. వీటిపై చర్చించాల్సిన అవసరం ఉంది.

● జిల్లా స్త్రీ, శిశుసంక్షేమశాఖ ద్వారా జిల్లాలో సాగుతున్న అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు బాలారిష్టాలు పట్టుకున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలలో మరుగుదొడ్ల నిర్మాణాలు నాణ్యతా లోపంగా కొనసాగుతున్నాయి. బాల సంజీవని పథకం కిట్స్ పక్కదారి పడుతున్నాయి.

● పంచాయతీరాజ్‌శాఖలో సిమెంట్ రోడ్లు, తారు రోడ్లు, మెటల్ రోడ్లు, కాంపౌండ్ వాల్ తదితర మొత్తం 999 పనులను రూ.8,017.21 లక్షలతో ప్రారంభించారు. వాటి బిల్లులతో పాటు ఉపాధి హామీ పథకం ఫేజ్ 1, 2, 3 కింద చేపట్టిన పలు పనులకు బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతుండంతో కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారు.

● పంచాయతీశాఖ పరిధిలోని చాలా గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. 2024-25కు గాను 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా చేపట్టిన పనులు నాసిరకంగా ఉన్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే జిల్లాలోని 16 పంచాయతీల్లో దాదాపు రూ.3 కోట్లను పక్కదారి పట్టించారు. పన్ను వసూళ్లలో సిబ్బంది చేతివాటాన్ని ప్రదర్శిస్తు ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. వేతనాలను సక్రమంగా చెల్లించలేదని క్లాప్ మిత్రలు ఆందోళన చెందుతున్నారు. వీటన్నింటిపై జడ్పీ సర్వసభ్య సమావేశంలో చర్చ సాగించి పరిష్కారం చూపుతారని జనం గంపెడాశతో ఎదురుస్తున్నారు.

అప్రమత్తం చేసేందుకే మాక్‌డ్రిల్


బస్టాండులో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపకశాఖాధికారులు

రాయచోటిటౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): యుద్ధం అనివార్యమైనప్పుడు ప్రజలు ఏ విధంగా దానిని ఎదుర్కోవాలో తెలిపేందుకే అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో సివిల్ మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. బుధవారం రాయచోటిలోని ఆర్టీసీ బస్టాండులో రెవెన్యూ, పోలీసు, వైద్య ఆరోగ్యశాఖ, అగ్నిమాపక శాఖల ఆధ్వర్యంలో సివిల్ మాక్ డ్రిల్ విజయవంతంగా నిర్వహించారు. శత్రుదేశం నుంచి మన దేశంలోని ఏ ప్రాంతం మీదైనా దాడి జరిగినప్పుడు ఏ విధంగా ఎదుర్కోవాలో తెలియజేసేందుకే ఈ మాక్‌డ్రిల్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో శ్రీనివాస్ మాట్లాడుతూ యుద్ధం వచ్చినప్పుడు ప్రజలు తమని తాము ఎలా రక్షించుకోవాలి అని తెలియజెప్పే కార్యక్రమమే సివిల్ మాక్ డ్రిల్ అని చెప్పారు. జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి అనిల్‌కుమార్ మాట్లాడుతూ సివిల్ మాక్‌డ్రిల్ కార్యక్రమాన్ని బుధవారం ఉదయం 11 గంటలకు సైరన్ మోగించి ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో రాయచోటి తహసీల్దార్ నరసింహకుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఉషశ్రీ, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది, పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షా కేంద్రం తనిఖీ

వీలేరురూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను కడప ఆర్జేడీ ఎ.శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. బుధవారం ఆయన పీలేరు ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలల్లో జరుగుతున్న పరీక్షలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో నిబద్ధతతో వ్యవహరించాలని, నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

పరీక్షా కేంద్రాల్లో సౌకర్యాలు, విద్యార్థులకు అందించాల్సిన మౌలిక వసతులు తదితర ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఆర్జేడీ వెంట ఎగ్జామినేషన్ చీఫ్ సూపరింటెండెంట్లు వై.వెంకటరెడ్డి, బి.రెడ్డెప్ప, జిల్లా ఎగ్జామినేషన్ కమిటీ సభ్యుడు నాగ సురేష్, సిట్టింగ్ స్క్వాడ్ సభ్యుడు భాస్కర్, డిపార్ట్‌మెంటల్ అధికారులు వెంకటరమణ, బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ అసిస్టెంట్లను

డిమోషన్ చేయడం సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ

మదనపల్లెటౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): ఉన్నత పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న స్కూల్ అసిస్టెంట్లను డిమోషన్ చేసి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులుగా మార్చడం సరికాదని ఏపీ ఉపాధ్యాయుల సంఘం (ఏపీఏఎస్) రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ విమర్శించారు. బుధవారం స్థానిక ఆపస్ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 19 ప్రకారం మిగులు స్కూల్ అసిస్టెంట్లను ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా మార్చడం అవమానపరిచినట్లు ఉందన్నారు. ఈ జీవో అసంబద్ధంగా ఉందని, ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని, ప్రతి 20 మంది విద్యార్థులకు ఒక ఎస్జీటీని నియమించాలని డిమాండ్ చేశారు. ఆపస్ జిల్లా అధ్యక్షుడు నరసింహులు, కార్యదర్శి రమణారెడ్డి మాట్లాడారు. సమావేశంలో ఆపస్ నాయకులు రెడ్డి రాజేశ్వరి, రెడ్డిశేఖర్, సిద్దారెడ్డి, రమణ, కొండారెడ్డి, గిరీష్, గోపాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్‌లో మదనపల్లె విద్యార్థికి జిల్లా ఫస్ట్ ర్యాంకు


కార్తీక్

మదనపల్లె టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన పాలిసెట్ ఫలితాల్లో మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెకు చెందిన చేనేత కార్మికుడు వెంకటసుబ్బయ్య, శైలజ కుమారుడు బి.కార్తీక్ 117/120 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 188వ ర్యాంకు సాధించాడు. జిల్లాలో ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించగా అందులో కార్తీక్ 188వ ర్యాంకుతో జిల్లాలో ఫస్ట్ ర్యాంకు సాధించాడు. ఎం.రెడ్డిరచన 117/120 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 277 ర్యాంకు, ఒ.మహ్మద్ అఫ్రాన్ 114/120 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 601 ర్యాంకు సాధించాడు. ఇదిలా వుండగా జిల్లా వ్యాప్తంగా 3981 మంది పాలిసెట్ పరీక్షకు హాజరు కాగా వీరిలో 3,768 మంది అర్హత సాధించారు.

ఘనంగా మహా చండీ హోమం


రెడ్డెమ్మకొండలో మహా చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

గుర్రంకొండ, మే 14 (ఆంధ్రజ్యోతి): సంతానలక్ష్మీ రెడ్డెమ్మ అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ మహాకుంభాభిషేకం మహోత్సవంలో భాగంగా బుధవారం మహాచండీ హోమాన్ని వేదపండితులు ఘనంగా నిర్వహించారు. రెండవ రోజు ఉదయాన్నే దేవత ఉత్థాపనం, పంచామృత స్నపనం, దీక్షా హోమం, యంత్రప్రతిష్ఠ, మూలమంత్రహననం, వాస్తు హోమం, మహా చండీహోమాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. వారికి తీర్థప్రసాదాలను అందజేసి అన్నదాన కార్యక్రమాలను చేశారు. కార్యక్రమంలో ఈవో మంజుల, ఎంపీటీసీ రెడ్డిప్రసాద్‌నాయుడు, సర్పంచ్ ప్రేమకుమారి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రచందనం కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలుశిక్ష


నిందితుడు ఆదినారాయణరాజు

రాయచోటిటౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో నిందితుడికి 5 సంవత్సరాల జైలుశిక్షతో పాటు రూ.6 లక్షల జరిమానా విధిస్తూ తిరుపతి కోర్టు ఇచ్చిందని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. పీలేరు మండలం మారంరెడ్డిగారిపల్లె ఎర్రగుంట్లపల్లెకు చెందిన అరవ వెంకట ఆదినారాయణరాజు 2021 సంవత్సరం జనవరి 11వ తేదీ రాత్రి 7 గంటల ప్రాంతంలో ఎర్రచందనాన్ని అక్రమ రవాణా చేస్తున్నట్లు సమాచారం రావడంతో అప్పటి వాల్మీకిపురం ఎస్‌ఐ వెంకటేశ్వర్లు వాహనాలు తనిఖీ చేసి ముగ్గురు నిందితులను పట్టుకున్నారన్నారు. ఎస్‌ఐ సమగ్ర నివేదికను కోర్టుకు సమర్పించగా ప్రస్తుతం ముగ్గురు నిందితుల్లో గుండ్లూరు చెంగల్‌రెడ్డి, దళారి నారాయణరాజులు కేసు విచారణ జరుగుతుండగా అనారోగ్యంతో మృతి చెందారని తెలిపారు. నిందితుడు వెంకట ఆదినారాయణరాజుపై విచారించిన జిల్లా అడిషనల్ న్యాయమూర్తి నరసింహమూర్తి ఐదేళ్ల జైలుశిక్షతో పాటు రూ.6 లక్షల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారన్నారు.

నైపుణ్యంతో నేరగాళ్లను గుర్తించండి

శిక్షణ కార్యక్రమంలో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు


శిక్షణలో మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యంతో నేరగాళ్లను గుర్తించడంతో పాటు సాంకేతిక పరిజ్ఞానంతో నేరగాళ్ల ఎత్తుగడలకు అడ్డుకట్ట వేస్తూ జిల్లాలో నేరాల కట్టడికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. బుధవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఫోరెన్సిక్ సైన్స్ ఎవిడెన్స్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేరం చేసిన వ్యక్తి శిక్ష నుంచి తప్పించుకోకుండా నేర స్థలంలో సాక్ష్యాధారాల సేకరణ, వాటి భద్రతా ప్రమాణాలు ఎలా పాటించాలనే విషయాలపై ప్రత్యేక శ్రద్ధ ఉంచాలని తెలియజేశారు. ఫోరెన్సిక్ సైన్స్‌లో గల అన్ని విభాగాలకు సంబంధించి నిష్ణాతులైన వారితో ఈ శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో రాజంపేట సబ్ డివిజన్ ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్‌హెగ్డే, విజయవాడ ఫోరెన్సిక్ నిపుణులు కిరణ్‌కుమార్, మురళి, అనంతపురం ఆర్ఎఫ్ఎస్ఎల్ అధికారులు జయరాజు, కుళాయమ్మ, జిల్లాలోని సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచిత స్పోకెన్ ఇంగ్లీషు, కెరీర్ కౌన్సెలింగ్ తరగతులు

రాయచోటి, మే 14 (ఆంధ్రజ్యోతి): పినాక ప్రజా సాధికార ట్రస్టు, ఐఆర్ఎస్ అధికారి బి.యాదగిరి ఆధ్వర్యంలో బుధవారం నుంచి జూన్ 4వ తేదీ వరకు 21 రోజులపాటు ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్, కెరీర్ కౌన్సెలింగ్, జీవన నైపుణ్యాలు, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ తరగతులను రాయచోటి, మదనపల్లె పట్టణాల్లో నిర్వహించనున్నారు. ఈ తరగతుల్లో బి.యాదగిరి 'జీవన నైపుణ్యాలు, సివిల్ సర్వీస్ పరీక్షల తయారీకి దిశానిర్దేశం, డిబేట్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూలను ఎలా ఎదుర్కోవాలి' అనే అంశాలపై బోధిస్తారు. మానసిక వ్యక్తిత్వ వికాస శిక్షకులు, పినాక సీఈవో కొల్లి రాజారాం విద్యార్థులకు తరగతులు తీసుకుంటారు. వీరితో పాటు జీవితంలోని వివిధ రంగాలలో విజయం సాధించిన వ్యక్తులు తమ అనుభవాలను వివరిస్తారు. అనుభవజ్ఞులైన శిక్షకులతో స్పోకెన్ ఇంగ్లీష్, కాంపిటీటివ్ ఇంగ్లీషు తరగతులు నిర్వహిస్తారు. డిగ్రీ, పీజీ, బీటెక్ చదివిన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని నిర్వాహకులు కోరారు.

మదనపల్లె పట్టణం ప్రశాంత్‌నగర్‌లోని జ్ఞానోదయ ఇంగ్లీషు మీడియం హైస్కూల్ ఆవరణలో ఈ తరగతులు నిర్వహిస్తారు. టీవీ-45 చైర్మన్ వలిగట్ల రెడ్డెప్ప చీఫ్ ప్యాట్రన్‌గా, లలితకుమారి, రేణుక, రెడ్డెప్పలు డైరెక్టర్లుగా వ్యవహరిస్తారు.

రాయచోటి పట్టణంలోని శ్రీషిరిడీ సాయి మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో జరిగే తరగతులకు ముఖ్య ప్యాట్రన్‌గా రాయచోటి కీస్ సొసైటీ, కె.రఘునాథ, గౌనిపల్లె శివ డెరెక్టర్లుగా వ్యవహరిస్తారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రోజూ తరగతులు జరుగుతాయి. ప్రతి సెంటర్‌లో 100 మంది విద్యార్థులకు అవకాశం ఉంటుంది విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్‌తో పాటు మధ్యాహ్న భోజనం, దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ఉచిత హాస్టల్ వసతి కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మెరుగైన సేవలు అందించాలి : మంత్రి

రాయచోటిటౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలను అందించాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం రాయచోటి పట్టణంలోని ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయంలో రూ.10 లక్షలతో రీమోడల్ చేసిన ఎస్‌ఈ కార్యాలయాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని మారుమూల గ్రామాలకు సైతం మెరుగైన విద్యుత్ అందిస్తోందన్నారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. విద్యుత్ అధికారులకు ఎటువంటి సమస్యలున్నా వెంటనే తమకు తెలియజేసి పరిష్కరించుకోవచ్చునన్నారు. జిల్లా ఏర్పడిన అనంతరం రాయచోటి పట్టణంలో ఏపీఎస్పీడీసీఎల్ నూతన ఎస్‌ఈ కార్యాలయం ఏర్పాటు చేశామని, నూతన ఎస్‌ఈ ఛాంబర్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ చంద్రశేఖర్‌రెడ్డి, విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఎస్‌ఈ నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

31 మంది ఎస్‌ఐల బదిలీ

● ఉత్తర్వులు జారీ చేసిన ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంతో పాటు జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్‌స్టేషన్‌లలో పనిచేస్తున్న 31 మంది ఎస్‌ఐలను బదిలీ చేస్తూ బుధవారం ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా హెడ్ క్వార్టర్‌లో ఉన్న విష్ణువర్ధన్‌ను రాయచోటి అర్బన్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ-1గా, ఇక్కడ పనిచేస్తున్న నరసింహారెడ్డిని జిల్లా హెడ్‌క్వార్టర్స్‌లోని సైబర్ క్రైమ్ ఎస్‌ఐగా, రాయచోటి అర్బన్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ-2గా పనిచేస్తున్న మహమ్మద్ అబ్దుల్ జహీర్‌ను జిల్లా హెడ్ క్వార్టర్‌లోని డీఎస్‌బీ ఎస్‌ఐ-1గా, పీలేరు అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ-2గా ఉన్న లోకేశ్‌ను రాయచోటి అర్బన్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ-2గా బదిలీ చేశారు. అలాగే వీఆర్‌లో ఉన్న బాలాజీనాయక్‌ను పీలేరు అర్బన్‌స్టేషన్ ఎస్‌ఐ-2గా, సైబర్ క్రైమ్ ఎస్‌ఐగా ఉన్న టీవీఎస్ చిరంజీవిని వీరబల్లి ఎస్‌ఐగా, వీరబల్లి ఎస్‌ఐమోహన్‌నాయక్‌ను సీసీఎస్ ఎస్‌ఐ-3గా, వీఆర్‌లో ఉన్న మల్లికార్జునరెడ్డిని నందలూరు ఎస్‌ఐగా, గుర్రంకొండ ఎస్‌ఐ మధురామచంద్రుడును డీసీఆర్బీ ఎస్‌ఐ-1గా, వీఆర్‌లో ఉన్న వెంకటేశ్‌ను రాజంపేట అర్బన్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ-1గా, వీఆర్‌లో ఉన్న రాందాస్‌ను రాజంపేట అర్బన్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ-2గా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. అలాగే రాజంపేట అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ1గా ఉన్న లక్ష్మిప్రసాద్ రెడ్డిని రైల్వేకోడూరు అర్బన్ ఎస్‌ఐగా, రైల్వేకోడూరు అర్బన్ ఎస్‌ఐ నవీన్‌బాబును గుర్రంకొండ ఎస్‌ఐగా, డీసీఆర్బీ ఎస్‌ఐగా ఉన్న శివకుమార్‌ను పుల్లంపేట ఎస్‌ఐగా, డీసీఆర్బీ ఎస్‌ఐ-2గా ఉన్న అన్వర్‌బాషాను మదనపల్లె వన్‌టౌన్ పీఎస్ ఎస్‌ఐ-2గా బదిలీ చేశారు.

మదనపల్లె వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ2గా పనిచేస్తున్న శ్రీనివాస్‌నాయక్‌ను రాయచోటి ఉమెన్స్ పీఎస్ ఎస్‌ఐ-3గా, వీఆర్‌లో ఉన్న బాలరాజును ఉమెన్స్ పీఎస్ ఎస్‌ఐ-4గా, మదనపల్లె అర్బన్ తాలూకా పీఎస్‌లో ఎస్‌ఐ-2 చంద్రమోహన్‌ను మదనపల్లె తాలూకా పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ-1, మదనపల్లె తాలూకా పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ-1 హరిప్రసాద్‌ను పీటీఎం పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ-1గా, మదనపల్లె తాలూకా ఎస్‌ఐ-1 హరిహరప్రసాద్‌ను పీటీఎం పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా, మదనపల్లె టూటౌన్ ఎస్‌ఐ-2 గాయత్రిని మదనపల్లె తాలూకా పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ-2గా బదిలీ చేశారు. వీఆర్‌లో ఉన్న శ్రీనాధ్ ప్రసాద్‌ను మదనపల్లె టూ టౌన్ ఎస్‌ఐ-2గా, పీటీఎం ఎస్‌ఐ రవికుమార్‌ను రామసముద్రం ఎస్‌ఐగా, వీఆర్‌వోలో ఉన్న ఉమామహేశ్వరిని తంబళ్లపల్లె ఎస్‌ఐగా, వీఆర్‌లో ఉన్న వెంకటేశ్వర్లును పెద్దమండెం ఎస్‌ఐగా, డీఎస్‌ఈ ఎస్‌ఐ-1గా ఉన్న శ్రీనివాసులరెడ్డిని అన్నమయ్య డీఎస్‌బీ ఎస్‌ఐ-2గా బదిలీ చేశారు. అలాగే పెద్దమండెం ఎస్‌ఐగా ఉన్న పీవీ రమణను డీఎస్‌బీ ఎస్‌ఐ-3గా, వీఆర్‌లో ఉన్న సూర్యనారాయణను డీఎస్‌బీ ఎస్‌ఐ-4గా, వీఆర్‌లో ఉన్న సుబ్రమణ్యం నాయక్‌ను డీఎస్‌బీ ఎస్‌ఐ-5గా, వీఆర్‌లో ఉన్న జయరామప్పను డీసీఆర్‌బీ ఎస్‌ఐ-2గా వీఆర్‌లో ఉన్న శివకామినీని పీసీఆర్ ఎస్‌ఐ-2గా నియమిస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. వారికి కేటాయించిన పోలీస్‌స్టేషన్‌లలో రిపోర్టు చేయాలని ఆదేశించారు.

వైభవంగా రథోత్సవం


వెల్లాలలో శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి రథోత్సవం

● జనసంద్రమైన వెల్లాల క్షేత్రం

రాజుపాలెం, మే 14 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన వెల్లాల బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి రథోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారి రథాన్ని ప్రత్యేక పూల అలంకరణ చేశారు. ప్రత్యేక పూజలు, హోమం తదితర కార్యక్రమాల అనంతరం రథంపై ఉత్సవ విగ్రహాలను కూర్చోబెట్టి ఊరేగింపు మొదలుపెట్టారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా దేవదాయశాఖ సహాయ కమిషనర్ మల్లిఖార్జున ప్రసాద్, ఆలయ ఈవో వెంకటరమణ, ఆలయ కమిటీ జీఎల్ నారాయణరెడ్డి, టీడీపీ నాయకులు తోట మహేశ్వర్‌రెడ్డి, మండల టీడీపీ నాయకులు చెమికల పురుషోత్తంరెడ్డి తదితరులు ప్రారంభించారు. మాడవీధుల్లో రథంపై ఊరేగుతున్న స్వామివారి దర్శనానికి తరలివచ్చిన భక్తులతో వెల్లాల పుణ్యక్షేత్రం జనసంద్రమైంది. రథోత్సవానికి హాజరైన భక్తులకు పది చోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం 3.30గంటలకు బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ వెంకటరమణ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

కడప ఎడ్లకు ప్రథమ బహుమతి

వెల్లాల చెన్నకేశవ సంజీవరాయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాష్ట్రస్థాయి సీనియర్ వృషభాలకు బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, మాజీ జడ్పీటీసీ తోట మహేశ్వ ర్‌రెడ్డి, బ్రహ్మోత్సవాల కమిటీ సభ్యులు ప్రారం భించారు. ఈ పోటీల్లో వైఎస్ఆర్ కడప జిల్లా చౌటపల్లెకు చెందిన మార్తల చంద్రఓబులరెడ్డి ఎడ్లు ప్రథమ స్థానంలో నిలిచి రూ.1.11 లక్షలు గెలుపొందాయి. రెండో స్థానంలో బోరెడ్డి కేశవరెడ్డి పెద్దకొట్టాల, సుంకి సురేందర్‌రెడ్డి ఎడ్లు రెండో బహుమతి రూ.75 వేలు, మూడో స్థానంలో నంద్యాల జిల్లా గుంపుర మండిన్నె కందుకూరు రాంభూపాల్‌రెడ్డి ఎడ్లకు రూ.50 వేలను కమిటీ సభ్యులు అందించారు.


బహుమతులు అందిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

డాక్టర్ వైఎస్సార్ ఏఎఫ్ఏయూ 12 విభాగాలకు ఏఐసీటీఈ అనుమతి

కడప ఎడ్యుకేషన్, మే 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో 2025-26 విద్యా సంవత్సరానికి 12 టెక్నికల్ విభాగాలన్నింటికి ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) నుంచి అనుమతి పొడిగింపు పొందినట్లు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జి.విశ్వనాథ్‌కుమార్ తెలిపారు. 2023లో మొదటిసారిగా లెటర్ ఆఫ్ అప్రూవల్ పొందిన ఈ విశ్వవిద్యాలయం ప్రతి సంవత్సరం అనుమతిని విజయవంతంగా పొందుతోందన్నారు. టెక్నికల్ విద్యలో తన అంకితభావాన్ని నిరూపించుకున్నట్లు స్పష్టం చేశారు. అనుమతి పొందిన విభాగాలలో స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (ఎస్‌పీఏ), కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ (సీఎఫ్ఏ) రెండూ ఉన్నాయన్నారు. ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, డిజిటల్ టెక్నిక్స్ ఫర్ డిజైన్ అండ్ ప్లానింగ్, ఫెసిలిటీస్ అండ్ సర్వీసెస్ ప్లానింగ్, గేమ్ డిజైన్ టెక్నాలజీస్, కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్, ఇంటీరియర్ డిజైన్, ఫైన్ ఆర్ట్స్ ప్రోగ్రాములు, అప్లైడ్ ఆర్ట్, ఆనిమేషన్, పెయింటింగ్, స్కల్ప్చర్, ఫొటోగ్రఫీ విభాగాలు ఉన్నాయన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి పై 12 ప్రోగ్రాములకు ఏడీసెట్, ఈఏపీసెట్ ద్వారా ప్రవేశాలు పొందుటకు మార్గం సుగమం కానుందన్నారు. మరిన్ని వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.వైఎస్ఆర్ఏఎఫ్‌యూ.ఏసీ.ఇన్‌ను సందర్శించవచ్చని తెలిపారు.

ప్రొద్దుటూరు మున్సిపాలిటీ అక్రమాలపై ఉదాసీనత

● ఆరుగురు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులకు నోటీసులు

కలికిరి, మే 14 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపాలిటీ భవన నిర్మాణాలకు అనుమతులు జారీ చేయడం, అనంతరం కట్టడాల తీరుతెన్నులను పర్యవేక్షించడం కారణంగా జరిగిన అక్రమాలకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవడంలో ఉదాసీనత చూపించిన వ్యవహారం చివరికి రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలోని ఆరుగురు అధికారుల మెడకు చుట్టుకుంది. ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో నివాస కట్టడాలు, వాణిజ్య సముదాయాల నిర్మాణాలు, విద్యా సంస్థల భవనాల్లో అనేక అక్రమాలు చోటు చేసుకున్నట్లు విచారణలో వెల్లడయ్యింది. అందుకు బాధ్యులైన ప్రొద్దుటూరు మున్సిపాలిటీ అధికారులపై చర్యలు తీసుకోవడానికి సిఫారసులు అందాయి. అభియోగాలు నమోదైన వారిపై చర్యలకు ఉపక్రమించకుండా రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో పనిచేసే ఆరుగురు అధికారులు ఉదాసీనంగా వ్యవహరించారని గుర్తించారు. ప్రస్తుతం అక్రమార్కుల విషయాలు అటుంచితే ఉదాసీనంగా వ్యవహరించి చర్యలు తీసుకోవడానికి అడ్డుపడ్డ అధికారులకు ప్రభుత్వం బుధవారం నోటీసులు జారీ చేసింది. 15 రోజుల్లోగా అభియోగాలపై పూర్తి వివరణలు సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇలా నోటీసులు జారీ చేయబడిన వారిలో రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ సి సెక్షన్ సూపరింటెండెంట్, ప్రస్తుత వడ్డేశ్వరం మున్సిపల్ కమిషనరు జి.రమణారెడ్డి, ప్రస్తుత బాపట్ల మున్సిపల్ కమిషనర్ అప్పటి ఎంఏయూడీ సూపరింటెండెంట్ జి.రఘునాథరెడ్డి, ప్రస్తుతం కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనరు ఆర్‌జీవీ కృష్ణ, ప్రస్తుతం సెవులో ఉన్న అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్ సత్యనారాయణ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలోని ఏ1 సహాయకులు షాలినీ దేవి, కె.ఇందిర వున్నారు. అక్రమార్కులను కాపాడబోయి వీరంతా అభియోగాలకు గురయ్యారని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్ర మున్సిపల్ వ్యవహారాలు, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ బుధవారం ఆరుగురికి విడివిడిగా నోటీసులు జారీ చేశారు.

బద్వేలు మున్సిపాలిటీ అక్రమాల్లో 8 మందిపై విచారణ

కలికిరి, మే 14 (ఆంధ్రజ్యోతి): బద్వేలు మున్సిపాలిటీలో ఐదుగురు ఇంజినీర్లతోపాటు మరో ముగ్గురు అధికారులపై విచారణకు ఆదేశిస్తూ ప్రభుత్వం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. అనంతపురం సర్కిల్ ప్రజారోగ్య సూపరింటెండింగ్ ఇంజినీరు ఆర్.రామమోహన్ రెడ్డిని విచారణాధికారిగా నియమించగా ఆయన సహాయకారిగా అవసరమైన రికార్డులను సమకూర్చడానికి కడప ప్రజారోగ్య ఎక్జిక్యూటివ్ ఇంజినీరును నియమించింది. బద్వేలు మున్సిపాలిటీలో సమగ్ర తాగునీటి సరఫరా అభివృద్ధి పనుల్లో చోటు చేసుకున్న అనేక అక్రమాలు, అవకతవలపై విజిలెన్స్ విచారణ చేపట్టి 2023 డిసెంబరు 5న ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. ఈ అక్రమాల్లో బద్వేలు మున్సిపాలిటీలో అప్పటి ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఆర్.నగేష్‌బాబు, డిప్యూటీ ఈఈ కె.గురప్ప యాదవ్, మరో డీఈఈ పి.తులసికుమార్, ఏఈ జి.వరప్రసాద్, టెక్నికల్ ఆఫీసర్ జి.రమేష్, డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ వేముల జ్యోతి, మరో డివిజనల్ అకౌంట్స్ ఆఫీసరు ఎల్.గోవిందనాయక్, రిటైర్డు ఈఈ డి.శివనాగేంద్రల భాగస్వామ్యం ఉన్నట్లు విజిలెన్స్ తేల్చింది. ఈ విచారణ మేరకు వీరందరినీ అక్రమాలకు బాధ్యులుగా నిర్ధారిస్తూ విచారణ జరగనుంది. ఈ మేరకు మున్సిపల్ వ్యవహారాలు, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు.

18న జాతీయస్థాయి బండలాగుడు పోటీలు

జమ్మలమడుగు, మే 14 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నారాపురం వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో 18వ తేదీ జాతీయస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 18వ తేదీ ఉదయం 7.30 గంటలకు న్యూ కేటగిరి విభాగంలో, 19వ తేదీ ఉదయం సీనియర్స్ విభాగం ఎడ్లకు బండలాగుడు పోటీలు ఉంటాయని తెలిపారు.

ఏటీఎంలో చోరీకి యత్నం


వేలిముద్ర నమూనాలను సేకరిస్తున్న క్లూస్ టీం ఇన్‌స్పెక్టర్

ముద్దనూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక నాలుగు రోడ్ల కూడలిలోని వన్‌ఇండియా ఏటీఎంలో గుర్తుతెలియని దొంగలు చోరీకి యత్నించారు.పోలీసుల వివరాల మేరకు... బుధవారం తెల్లవారు జామున గుర్తుతెలియని వ్యక్తులు ఏటీఎం గదిలో కారంపొడి చల్లి క్యాష్ బాక్సు ఉన్న డోరును తెరిచారు. అయితే క్యాష్ బాక్సును తెరవడంలో విఫలమయ్యారు. సమాచారం అందిన వెంటనే సీఐ దస్తగిరి పోలీసు సిబ్బందితో కలసి ఏటీఎం వద్దకు వెళ్లి పరిశీలించారు. క్లూస్ టీం ఇన్‌స్పెక్టర్ రుక్మిణీదేవి ఏటీఎంను పరిశీలించి, పరీక్ష కోసం వేలిముద్రల నమూనాలను సేకరించినట్లు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం



ముద్దనూరు మే 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి జమ్మలమడుగు రహదారిలోని పులికోన మలుపు సమీపంలో బుధవారం తెల్లవారుజామున షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం అయ్యింది. స్థానికుల సమాచారం మేరకు... కొండాపురం మండలానికి చెందిన అహమ్మద్‌బాషా కారులో ముద్దనూరు మీదుగా నంద్యాలకు వెళుతున్నాడు. ఘాట్‌లో పులికోన మలుపు సమీపంలో కారు ఏసీలో షార్ట్ సర్క్యూట్ అయ్యింది. దీంతోమంటలు చెలరేగాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బంది వచ్చిమంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే కారు పూర్తి గా కాలిపోయింది. అయితే కారులో ఉన్న వారికి ఎటువంటి ప్రమాదం జరగలేదు.

18 టన్నుల చీనీకాయలు చోరీ

కొండాపురం, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లావనూరు గ్రామంలో తోటల్లోని చీనీకాయలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మూడురోజుల కిందట ఉమామహేశ్వరరెడ్డి అనే రైతు తోటలోని 12 టన్నుల చీనీకాయలు, లక్ష్మిరెడ్డి అనే రైతు తోటలోని 6 టన్నుల చీనీకాయలను రాత్రిపూట చెట్ల నుంచి కోసుకెళ్లినట్లు రైతులు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.6లక్షల వరకు ఉంటుందని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతి చెందిన గంగరాజు

కలసపాడు, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లారెడ్డి పల్లెకు చెందిన గంగరాజు (25) అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బుధవారం గంగరాజు తన సొంత పనిపై ద్విచక్ర వాహనంలో ప్రకాశం జిల్లా గిద్దలూరుకు వెళ్తుండగా సంజీవరాయుని పేట వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అక్కడి పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని గిద్దలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్యతో పాటు రెండేళ్ల కుమారుడు ఉన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడు మృతి



ప్రొద్దుటూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు-ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డులోని సినీహబ్ ఎదుట గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడు. బుధవారం ఉదయం స్థానికులు రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. సుమారు 60 నుంచి 65 ఏళ్లలోపు ఉండవచ్చని, లైట్ బ్లూగళ్ల చొక్కా, పట్టెల లుంగీ ధరించి వున్నాడని తెలిపారు. ఎవరైనా గుర్తిస్తే రూరల్ సీఐ, ఎస్‌ఐలు 9121100597, 9121100598, 9121100599 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



వల్లూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తప్పెట్ల గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుగ్గాయపల్లె వెంకటాపురం గ్రామానికి చెందిన బాబాఫక్రుద్దీన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. తన సొంత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంలో కడపకు వెళుతుండగా కడప నుంచి కమలా పురం వైపు వస్తున్న లారీ ఢీకొనంతో రోడ్డుపై పడ్డాడు. అదే సమయంలో కమలాపురం వైపు నుంచి కడపకు వెళుతున్న మరో లారీ అతని కాళ్లపై ఎక్కింది. దీంతో కాలు విరిగి రక్తగాయాలయ్యాయి. 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. మెరుగైన చికిత్స కోసం ఏలూరు సీఎంసీకి తరలించినట్లు వారి బంధువులు తెలిపారు.

మహిళపై హత్యాయత్నం కేసులో.. ఐదేళ్లు జైలుశిక్ష, రూ.70వేలు జరిమానా

కడప క్రైం, మే 14 (ఆంధ్రజ్యోతి): తనకు డబ్బులు ఇవ్వకుండా నిరాక రించిన ఓ మహిళపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తికి కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.70వేలు జరిమానా విధించినట్లు వన్‌టౌన్ సీఐ బి.రామక్రిష్ణ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. సిద్దవటం మండలం మంగనవండ్ల గ్రామానికి చెందిన కారుమంచి సురేశ్ అనే వ్యక్తి తన అక్క వరుసైన సులోచన అనే మహిళ వద్ద అప్పుడప్పుడూ డబ్బులు తీసుకుం టుండేవాడు. ఈ క్రమంలో 2020 ఫిబ్రవరి 2న సులోచనను డబ్బులు ఇవ్వమని అడగ్గా ఆమె నిరాకరించింది. దీంతో ఆమెను బూతులు తిట్టి తన వెంట తెచ్చుకున్న కత్తితో దాడి చేసి తలపై, కుడిచేతిపై గాయపరిచాడు. ఈ మేరకు బాధితురాలు వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి కడప వన్‌టౌన్ ఎస్‌ఐ బి.మధుసూదనరెడ్డి విచారణ చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసు విషయమై బుధవారం కడప అడిష నల్ ఏఎస్‌జె కోర్టు జడ్జి నిందితుడికి ఐదేళ్ల సాధారణ జైలు శిక్ష, రూ.70 వేలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు. కాగా సాక్ష్యాధారాలతో నిందితుడికి శిక్షపడేలా చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ అభినందించారు.

రాళ్లదాడిలో యువకుడు మృతి

చక్రాయపేట, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సురభి గ్రామం కోమటిపేటకు చెందిన కందుల చంటి (30) అనే యువకుడిపై సురభి హరిజనవాడకు చెందిన ముగ్గురు వ్యక్తులు మంగళవారం రాత్రి రాళ్లతో దాడి చేయడంతో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా... కోమటిపేటకు చెందిన కందుల చంటి సురభిహరిజన వాడకు చెందిన దర్శనమ్మతో చనువుగా ఉండటం చూసి రమణ, కుమార్, ఈశ్వరయ్యలు ఓర్వలేకపోయారు. ముగ్గురు కలసి చంటిని చంపాలని పథకం పన్నారు. ఈ నేపథ్యంలో చంటి ప్రతి నిత్యం ట్రాక్టర్‌తో బొగ్గుల బట్టీల కోసం వేంపల్లె వైపు కట్టెలు తోలుతూ ఉంటాడు. మంగళవారం రాత్రి కట్టెలు విడిచి తిరిగి వస్తుండగా దేవరగుట్టపల్లె సమీపాన రమణ, కుమార్, ఈశ్వరయ్య రాళ్లతో దాడి చేయగా చంటి అక్కడే పడిపోయాడు. గమనించిన గ్రామస్థులు వారి బంధువులకు ఫోన్ ద్వారా తెలపడంతో హుటాహుటిన వచ్చి వేంపల్లెకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కడప రిమ్స్‌కు తరలించగా మృతి చెందాడు. ముగ్గురిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు.

విధులకు వెళ్తున్నానని చెప్పి ఆర్మీ ఉద్యోగి అదృశ్యం


నాగార్జునరెడ్డి (ఫైల్)

కలసపాడు, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముదిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన బైరెడ్డి నాగార్జునరెడ్డి అనే ఆర్మీ ఉద్యోగి గత నెల 1న విధులకు వెళ్తున్నట్లు చెప్పి అదృశ్యమయ్యాడు. ఉత్తరాఖండ్ రాష్ట్ర రేంజ్ ఆర్మీ ఆఫీసులో విధులు నిర్వహిస్తున్న అతను సెలవుపై ఫిబ్రవరి నెలలో తన స్వగ్రామమైన ముదిరెడ్డిపల్లెకు వచ్చాడు. సెలవుల అనంతరం ఏప్రిల్ 1న తిరిగి విధులకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లాడు. మీ అబ్బాయి విధులకు రాలేదని పనిచేస్తున్న ప్రాంతం నుంచి అధికారులు ఫోన్ చేయడంతో ఎక్కడికి వెళ్లాడోనని తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలైంది. తండ్రి నారాయణరెడ్డి ఫిర్యాదు మేరకు కలసపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తప్పిన ప్రమాదం

సీకేదిన్నె, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆజాద్‌నగర్ వద్ద ఊటుకూరు సర్కిల్ వైపు వరిగడ్డితో వస్తున్న ట్రాక్టర్‌ను వెనుకవైపు నుంచి టిప్పర్ ఢీకొనడంతో ట్రాక్టర్ పల్టీకొట్టింది. దీంతో వరిగడ్డి రోడ్డుపై పడిపోయింది. అయితే ఈ ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్, టిప్పర్ డ్రైవర్‌కు ఎటువంటి గాయాలు కాలేదు.

ఉపాధి పథకంలో అక్రమాలు, అవినీతి

● కలెక్టర్‌కు లేఖ రాసిన ఎంపీ అవినాష్‌రెడ్డి

పులివెందుల, మే 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథ కంలో భారీ అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆరోపించారు. జిల్లాలో ఉపాధి పనుల్లో జరుగుతున్న అవకతవకలపై కలెక్టర్ శ్రీధర్ చెరుకూరికి ఎంపీ లేఖ రాశారు. అందులో ఒకే ఫొటోతో అనేక పేర్లతో అప్‌లోడ్ చేస్తున్నారన్నారు. ఎప్పుడు అమలు చేయని పనులకు నకిలీ పత్రాల ఆధారంగా వేతన చెల్లింపులు జరిగాయన్నారు. అలాగే విదేశాలలో నివసిస్తున్న వారి పేర్లు కూడా మస్టర్‌లో చేర్చడం, పని జరగకున్నా, ఖాళీ మస్టర్‌లలో సంతకం చేయాలని కార్మికులను బలవంత పెడుతున్నారన్నారు. పులివెందుల నియోజక వర్గంలోని చక్రాయపేట మండలంలోని కుప్పం పంచాయతీలో నకిలీ ఎంట్రీలు, ఒకే కార్మికుడి ఫొటోలను పదేపదే ఉపయోగించారన్నారు. జిలా స్థాయి విచారణను ప్రారంభించాలని, రాజకీయ బలంతో అవినీతికి పాల్పడుతున్న ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

డీఆర్‌డీఏ పీడీ బాధ్యతలు స్వీకరణ



కడప ఎన్జీఆర్ సర్కిల్, మే 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామీణా బివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ పీడీ)గా డాక్టర్ రాజ్యలక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పూర్వపు పీడీ ఆనంద్‌నాయక్ ఆమెకు బాధ్యతలు అప్పగించారు. ఆనందనాయక్ పదోన్నతిపై తన మాతృశాఖకు బదిలీ అయిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఇన్‌చార్జ్ పీడీగా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మిని నియమించారు. దీంతో ఆమె బాధ్యతలను స్వీకరించారు. ఏపీడీ ప్రసాద్, సిబ్బంది నూతన పీడీకి ఘన స్వాగతం పలికారు.

ఆర్టీపీపీ సీఈగా వాసుదేవరావు


ఆర్టీపీపీ సీఈకి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్‌ఈలు

ఎర్రగుంట్ల, మే 14(ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎంవీఆర్ఆర్ ఆర్టీపీపీ చీఫ్ ఇంజినీర్‌గా జి.వాసుదేవరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. సీఈగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు స్థానిక ఎస్‌ఈలు సోమశేఖర్‌రెడ్డి, క్రిష్ణమోహన్, ఇతర అధికారులు, యూనియన్ నాయకులు, ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న గౌరీపతి విద్యుత్ సౌధకు బదిలీపై వెళ్లారు. కొత్త సీఈకి స్వాగతం, పాత సీఈకి వీడ్కోలు తెలుపుతూ సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు అధికారులు, ఉద్యోగులు ప్రసంగించారు.

గండికోట ప్రాజెక్టులో తగ్గుతున్న నీటిమట్టం

కొండాపురం, మే 14 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టులో నీటిమట్టం రోజురోజుకూ తగ్గుతూ వస్తోంది. ఎండాకాలం కావడం, ప్రాజెక్టు నుంచి అనుబంధ రిజర్వాయర్లకు నీరు విడుదల చేస్తుండటంతో నీటిమట్టం తగ్గుతోంది. ప్రస్తుతం జీఎన్ఎస్ఎస్ ప్రధాన కాలువ ద్వారా 200 క్యూసెక్కులు, తాగునీటి స్కీమ్‌కు 20 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో ఏమీ లేదన్నారు. గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 26.85 టీఎంసీలు కాగా ప్రస్తుతం 17.58 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు.

కడప-బెంగళూరు నూతన బ్రాడ్‌గేజ్ పనులను పునఃప్రారంభించాలి

వేంపల్లె, మే 14 (ఆంధ్రజ్యోతి): కడప-రాయచోటి-మదనపల్లె-బెంగుళూరు నూతన బ్రాడ్‌గేజ్ పనులను రైల్వేశాఖ వెంటనే పునఃప్రారంభించేటట్లు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి కోరారు. రైల్వేలైన్ విషయంపై తులసిరెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు బుధవారం బహిరంగ లేఖ రాశారు. 2008-09లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నూతన బ్రాడ్ గేజ్ రైలు మార్గాన్ని మంజూరు చేసిందన్నారు. మొదటిదశలో కడప నుంచి పెండ్లిమర్రి వరకు 21.80 కిలోమీటర్ల పని పూర్తి అయ్యిందన్నారు. 2019లో వైసీపీ అధికారం వచ్చాక పనులు చేపట్టలేదన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పునరాలోచించి కడప-బెంగుళూరు నూతన బ్రాడ్‌గేజ్ రైలు మార్గానికి రాష్ట్ర ప్రభుత్వ వాటాగా ఇవ్వాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

పాలిసెట్, ఏపీఆర్జేసీ ఫలితాల్లో 'విశ్వం' విద్యార్థుల హవా

● ఏపీఆర్‌జేసీలో స్టేట్‌లో టాప్‌టెన్‌లో నాలుగుర్యాంకులు

● పాలిసెట్‌లో జిల్లాస్థాయిలో టాప్ ర్యాంకులు కైవసం

తిరుపతి(విద్య), మే14 (ఆంధ్రజ్యోతి): ఏపీప్రభుత్వం బుధవారం విడుదల చేసిన ఏపీ ఆర్జేసీ, పాలిసెట్ ఫలితాల్లో తమ వద్ద శిక్షణ పొందిన విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని తిరుపతిలోని 'విశ్వం' స్కూల్ చైర్మన్ డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. ఏపీఆర్‌జేసీలో ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో వై.దేదీప్యకు 3వర్యాంకు, కె.మునిరూపేష్‌కు 7వ, జె.అంజలికి 9వ, మనీషాకు 10వ ర్యాంకు వచ్చింద న్నారు. వీరితో పాటు రేవంత్, అబ్దుల్‌ఖాదర్, యోగి, సమత, దేదీప్య, భవ్య, శ్రీగీతిక, రోషన్, ట్వింకిల్, సంతోష్, భువన, కార్తికేయ అత్యుత్తమ ర్యాంకులతో ప్రతిభ చాటారన్నారు. పాలిసెట్‌లో ఎం.కావ్యశ్రీ 120కి117మార్కులతో బాలికలవిభాగంలో జిల్లాలో టాపర్‌గా నిలచిందని ఆయన తెలిపారు. కిమ్యశ్రీ 116, కె.నిత్యశ్రీ 114, అబ్దుల్‌ఖాదర్ 113, సుజినిరెడ్డి, చాతుర్య, రాజకుమారి 112, ఎన్.రోషన్ 111, చేతన్‌రెడ్డి 110, జస్మిత 109 మార్కులతో ప్రతిభ చాటారన్నారు. సైనిక్, నవోదయ, మిలటరీస్కూల్ ప్రవేశ పరీక్షలతోపాటు ఏపీఆర్‌జేసీ, పాలిసెట్‌లోనూ తమ విద్యార్థులు ఏటా టాప్‌ర్యాంకులు సాధిస్తుండడం సంతోషంగా ఉందన్నారు. పోటీ పరీక్షల సమాచారం కోసం 8688888803/02, 9399976999 నెంబర్లలో సంప్రదించాలని కోరారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కరస్పాండెంట్ ఎన్.తులసివిశ్వనాథ్, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, విశ్వశ్రీ, టీచర్లు అభినందించారు.



ఏపీఆర్‌జేసీ టాపర్లను అభినందిస్తున్న విశ్వనాథరెడ్డి, విశ్వచందన్‌రెడ్డి



బోర్ పాయింట్ చూడబడును
జై గురుదత్త, కె.వి.రమణ, M.Sc., (Geologist) భూగర్భజల పరిశోధన, బోర్ పాయింట్ చూడబడును. సెల్ నెంబర్ : 63023 28007
Ajc-233881

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర:7382114647.
AJA- 237544

CHANGE OF NAME
I, Tangaturu Venkata Subbaiah S/o Tangaturu Pedda Venkateswarlu (Old Name) D.No. 7/3174-7, Srinivasa Nagar, Proddatur Town and Mandal, YSR (Dist.) A.P. have changed my name as Tanguturu Venkata Subbaiah S/o Tanguturu Venkateswarlu (New Name)
AJC-000

యూనిట్ కార్యాలయం
9985411183
9985411189

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

కనులవిందుగా కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

సిద్దవటం, మే 14 (ఆంధ్రజ్యోతి):మండలంలోని మాచుపల్లె గ్రామంలో వెలసిన రేణుకా యల్లమాంబ కల్యాణం బుధవారం వైభవంగా జరిగింది. చెన్నూరు మండలం శేషయ్యగారిపల్లెకు చెందిన అనుగోలు చిన్న యల్లయ్య కుమారుడు మల్లికార్జున, ప్రసాద్‌ల ఆధ్వర్యంలో రేణుకా యల్లమాంబ సమేత జమదగ్ని మహారాజుకు కల్యాణం జరిపించారు. వేదపండితులు, రంగసముద్ర మల్లికార్జునశర్మ, ప్రదీప్‌శర్మ అమ్మవారి కల్యాణం జరిపించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహించారు.

పండ్ల తోటలు సాగు చేసే రైతులను గుర్తించాలి : ఎంపీడీవో

ఒంటిమిట్ట, మే 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పండ్లతోటలను సాగు చేసే రైతులను గుర్తించాలని ఎంపీడీవో గౌస్‌బాషా తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యానవన శాఖ, ఉపాధి పథకం అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఖాళీగా ఉన్న భూములను గుర్తించి పండ్లతోటల పెంపకంపై అవగాహన కల్పించాలన్నారు. ఏవో కిరణ్‌కుమార్‌రెడ్డి, ఏపీవో శివశంకర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపుల పరిశీలన

సిద్దవటం, మే 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన సిద్దవటం, లింగంపల్లె, మూలపల్లె, దిగువపేట గ్రామాల్లో ఉన్న రేషన్‌షాపులను బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దారు సౌజన్య పరిశీలించారు. ఈ సందర్భంగా సౌజన్య మాట్లాడుతూ రేషన్ షాపుల్లో ఉన్న నిత్యావసర సరుకులు ఆన్‌లైన్ యాప్ సిస్టమ్‌లో పొందుపర్చేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు.ఇన్‌చార్జి తహసీల్దారు మాధవీలత, రెవెన్యూ ఆర్‌ఐ ప్రసాద్, వీఆర్వో గౌస్‌బాషా పాల్గొన్నారు.

'చంద్రబాబుతోనే సమగ్రాభివృద్ధి'

రాయచోటిటౌన్, మే14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి సమానంగా అందిస్తున్న ఏకైక ప్రభుత్వం సీఎం చంద్రబాబు ప్రభుత్వమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా పేర్కొన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి ఊతమిచ్చేందుకు ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, అమరావతిని త్వరగా పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. టీడీపీ నేతలు కొండారెడ్డి, ఇర్షాద్, రోఫా, నరసింహానాయుడు, జయరాంరెడ్డి, షరీఫ్, హైదర్, ఎస్ఎండీ రఫి పాల్గొన్నారు.

రెస్టారెంట్లలో వంట గదులను శుభ్రంగా ఉంచుకోవాలి

● మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు

రాజంపేట టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి) : రెస్టారెంట్లలో వంట గదులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు అన్నారు. బుధవారం రాజంపేట పట్టణంలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లలోని వంట గదులను బుధవారం మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో పట్టణంలోని స్పైసీ ఆఫ్ ఆంధ్ర, నాయుడు కుండ బిర్యాని, ఆంధ్ర స్పైసీ రెస్టారెంట్లను పరిశీలించారు. కాలం చెల్లిన ఆహార పదార్థాలను, ఎక్కువగా మరిగించిన ఆయిల్‌ను వాడకూడదన్నారు. పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన ఆహారం అందే విధంగా రెస్టారెంట్ల నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దళిత గ్రామాల్లో సమస్యలు పరిష్కరించండి

రైల్వేకోడూరు రూరల్, 14(ఆంధ్రజ్యోతి): దళిత గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ మహబూబ్ చాంద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగంపేట, కోడూరు పరిసర ప్రాంతాలలో వ్యవసాయ పరిశ్రమలు నెలకొల్పి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. మండలంలోని మాధవరంపోడు గ్రామంలో కొన్నేళ్లుగా శ్మశానికి దారి లేక దళితులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కాగా తమ పార్టీలో దాసరి జయచంద్రతో పాటు మనోహర్, క్రిష్టా, చిన్నగంగయ్య, రమణయ్య, రేణుక తదితరులు చేరినట్లు ఆయన తెలిపారు.

ఉపాధి గిట్టుబాటు కూలి

రూ.307 పడే విధంగా చూడాలి

రామాపురం, మే14(ఆంధ్రజ్యోతి):ఉపాధి కూలీలకు గిట్టుబాటు కూలి రూ.307 అందే విధంగా చూడాలని జిల్లా అంబుడ్స్ మ్యాన్ శివప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని సుద్దమళ్ల, నల్లగుట్టపల్లి పంచాయతీల్లో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూలీలకు దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఏపీవో పెంచలయ్య, జేఈఈ ఓబులేసు, టీఏ సురేంధర్‌నాయుడు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు నాగమణి, రాజశేఖర్ పాల్గొన్నారు.

రోడ్డు పనుల్లో నాణ్యత పాటించండి: ఈఈ

ఒంటిమిట్ట, మే 14 (ఆంధ్రజ్యోతి) :సిమెంటు రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలని పంచాయతీ రాజ్ ఈఈ రామచంద్రనాయక్ తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. మండలానికి 68 పనులు రూ.3.37 కోట్లతో మంజూరైనట్లు తెలిపారు. ఈ పనులను త్వరగా ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ శ్రీనివాసులు, ఏఈ కృష్ణప్రసాద్, ఈవోపీఆర్‌డీ ప్రసాద్, వ్యవసాయాధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

తిరుణంపల్లె బ్రిడ్జి నిర్మాణం ఎప్పుడో..?



కాలినడకన ద్విచక్ర వాహనంలో గుంజనేరును దాటుతున్న తిరుణంపల్లె వాసులు

పెనగలూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): పెనగలూరు మండలం తిరుణంపల్లె-పెనగలూరు మధ్యలో గుంజనేరుపై బ్రిడ్జి నిర్మాణం ఎప్పుడు జరుగుతుందోనని గుంజన్‌కు తూర్పున ఉన్న 12 గ్రామాల ప్రజలు అలాగే గుంజన్‌కు పడమర వైపు ఉన్న మరో 20 గ్రామాల ప్రజలు ఎదురు చూస్తున్నారు. తిరుణంపల్లె వద్ద గుంజనేరుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మిస్తే మండలంలోని సిరివరం, తిరణంపల్లె, రెడ్డివారిపల్లె, ఎల్‌బీ అగ్రహారం, కొండూరు, ఉప్పరపల్లె, వీఎంపురం, వెలగచర్ల గ్రామాలతో పాటు నందలూరు మండలంలోని చాపరోపల్లె, చుక్కాయపల్లె గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అలాగే గుంజనేరుకు పడమరవైపు ఉన్న ఎస్‌ఆర్‌పురం, పల్లంపాడు, కోడిచెన్నయ్యగారిపల్లె, పెనగలూరు, నాగిరెడ్డిపల్లె, కొత్తపల్లె, ఇండ్లూరు, సాతుపల్లె తదితర గ్రామాల ప్రజలకు కూడా ఉపయోగకరంగా ఉంటుంది. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఎమ్మెల్సీ బత్యాల చెంగల్‌రాయులు తిరుణంపల్లె వరకు తారురోడ్డు నిర్మాణంతో పాటు గుంజనేటిపైన హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.4 కోట్లు మంజూరు చేయించారు. అయితే పెనగలూరు నుంచి గుంజనేటి వరకు 2 కిలోమీటర్ల గుంజనేటి నుంచి తిరుణంపల్లె వరకు అర్ధకిలోమీటరు దూరం తారు రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. ఈ తారురోడ్డు నిర్మాణంలో అక్కడక్కడా కొన్నిచోట్ల కల్వర్టులు చిన్న చిన్న బ్రిడ్జిల నిర్మాణం కూడా జరిగింది. అయితే గుంజనేరుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి టెండర్లు సకాలంలో వేకపోవడం వల్ల ఆగిపోయింది. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ బ్రిడ్జి నిర్మాణం విషయం పూర్తిగా మరుగునపడిపోయింది. ఈ బ్రిడ్జి నిర్మాణం గురించి పట్టించుకునే నాథుడే లేడు. కాగా గతంలో టీడీపీ హయాంలో బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరై తారురోడ్డు నిర్మాణం జరిగింది. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది కాబట్టి ఇప్పుడైనా సమస్య తీరుతుందేమోనని మండల ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. కాగా వర్షాకాలంలో సోమశిల ప్రాజెక్టు వెనుకజలాలు గుంజనేరులో నిండుగా ఉన్నప్పుడు నందలూరు మండలంలోని 2 గ్రామాలు, పెనగలూరు మండలంలోని 12 గ్రామాలు, వెలగచర్ల, దామరచర్ల, గట్టువారిపల్లె, తూర్పుపల్లె గ్రామాల ప్రజలు ఈటమాపురం, సింగనమల మధ్యలో ఉన్న హైలెవల్ వంతెన ద్వారా 24 కిలోమీటర్లు చుట్టూ తిరిగి మండల కేంద్రానికి రావాల్సి ఉంది. సోమశిల ప్రాజెక్టులో నీరు ఉన్నంతకాలం అంటే సుమారు ఐదు నెలల పాటు ఆయా గ్రామాల ప్రజలకు తిప్పలు తప్పవు. ఇప్పటికైనా పాలకులు స్పందించి తిరణంపల్లె వద్ద గుంజనేరుపై హైవెవల్ బ్రిడ్జిని నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఎంపీడీవో విజయరావు ఏమంటున్నారంటే...



తాను ఆరు నెలల క్రితం ఇక్కడ ఎంపీడీవోగా చేరానని, తనకు ఈ బ్రిడ్జి నిర్మాణం గురించి పూర్తిగా తెలియదని పేర్కొన్నారు. ఇంతవరకు ఎవరూ బ్రిడ్జి విషయం గురించి తనతో మాట్లాడలేదన్నారు. ఒకవేళ ఈ బ్రిడ్జి నిర్మాణం గురించి ప్రభుత్వానికి సిఫారసు చేయాల్సి వస్తే తాను తప్పకుండా సహకరిస్తానని తెలిపారు.

పంచాయతీరాజ్ ఏఈ గంగులయ్య ఏమంటున్నారంటే...

గతంలో ఈ బ్రిడ్జి నిర్మాణానికి టెండర్లు వేయనందువల్ల ఆగిపోయిందన్నారు. ఆ తర్వాత ఈ బ్రిడ్జి నిర్మాణం విషయం పూర్తిగా మరుగనపడిపోయిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం చొరవ చూపితే బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టవచ్చని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే కొత్తగా ఎస్టిమేషన్లు తయారు చేసి ప్రభుత్వానికి పంపించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

ఏపీని అగ్రగామిగా ఉంచాలన్నదే సీఎం లక్ష్యం

● టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు



బోరును ప్రారంభిస్తున్న టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు

సుండుపల్లె, మే14(ఆంధ్రజ్యోతి): భారతదేశంలో ఏపీని అగ్రగామిగా ఉంచాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి లక్ష్యమని టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన రవాణా, మౌలిక వసతులు కల్పిస్తూ విద్య, వైద్యం అందించే దిశలో కూటమి పాలన సాగుతోందన్నారు. రానున్న ఐదేళ్లలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కూడా గడవకముందే రాష్ట్ర వ్యాప్తంగా మెరుగైన రవాణా వ్యవస్థకు బాటలు వేస్తున్నట్లు తెలిపారు. రాజంపేట నియోజకవర్గంలో గత ఐదు సంవత్సరాల్లో భూకబ్జాలు అధికంగా జరిగాయని, అక్రమార్కుల చెర నుంచి వాటిని విడిపించాలన్నారు. అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సుండుపల్లె మండలంలో ప్రభుత్వ స్థలాలు కొంత మంది నాయకుల కనుసన్నల్లో ఉన్నాయన్నారు. ఆ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రెడ్డెప్ప, ప్రధాన కార్యదర్శి ప్రసాద్‌రాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ శివరాంనాయుడు, గ్రామ అధ్యక్షుడు సుబ్బరాం పాల్గొన్నారు.

తాగునీటి కోసం రూ.3.5 కోట్లు మంజూరు

సుండుపల్లె, మే14(ఆంధ్రజ్యోతి): ఈ వేసవిలో నియోజకవర్గ వ్యాప్తంగా తాగునీటి సమస్య లేకుండా చేసేందుకు ప్రభుత్వం రూ.3.5 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు తెలిపారు. బుధవారం మండలంలోని జీ.రెడ్డివారిపల్లె, రాయవరం గ్రామ పంచాయతీల్లో రెండు చోట్ల తాగునీటి కోసం బోర్లు వేసేందుకు పూజచేశారు. సుండుపల్లె మండలంలో అవసరమైన 20 గ్రామాల్లో బోర్లు వేశామన్నారు. తాగునీటి సమస్యను వందశాతం పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం కొరివివాండ్లపల్లిలో మంజూరైన గోకులం షెడ్డు పనులకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్, ఎస్ఐ శ్రీనివాసులు, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు రెడ్డెప్ప, తెలుగు యువత మండల అధ్యక్షుడు సురేశ్‌నాయుడు, రాయవరం సర్పంచ్ షరీఫ్, మాజీ ఎంపీటీసీలు, టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యేక తరగతులకు ఉపాధ్యాయులు డుమ్మా

● విద్యార్థుల హాజరూ అంతంత మాత్రమే
● ఇలాగైతే ప్రభుత్వ లక్ష్యం నెరవేరినట్లే...!



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న టీచర్ రామాంజనేయరెడ్డి(ఫైల్)

ఒంటిమిట్ట, మే 14 (ఆంధ్రజ్యోతి):ఈ యేడాది జరిగిన పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించని విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి వారిని సప్లమెంటరీ పరీక్షలకు సిద్ధం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఆయా పాఠశాల ఉపాధ్యాయులు ప్రతిరోజు ఇద్దరు చొప్పున హాజరై ఆయా సబ్జెక్టుల్లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చి నమూన పరీక్షలు కూడా నిర్వహించాలి. కానీ ఒంటిమిట్ట ఉన్నత పాఠశాలలో అలా జరగడం లేదనే ఆరోపణలున్నాయి. వివరాలు ఇవీ...ఈ యేడాది పదో తరగతి పరీక్షలు 86 మంది రాశారు. ఇందులో 33 మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. 53 మంది ఫెయిల్ అయ్యారు. ఫలితాలు వెలువడిన తర్వాత నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఫెయిల్ అయిన 53 మంది విద్యార్థుల్లో కనీసం 10 మంది కూడా తరగతులకు హాజరు కావడంలేదు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా సమాచారం అందించామని, అయినా విద్యార్థులు రావడంలేదని ఉపాధ్యాయులు తెలిపారు. దీనికితోడు మంగళవారం ప్రత్యేక తరగతులకు ఉపాధ్యాయులు కూడా డుమ్మా కొట్టారు. అసలే విద్యార్థుల హాజరు అంతంతమాత్రమే ఉండడంతో ఉపాధ్యాయులు కూడా డుమ్మా కొడితే ఎలా అని తరగతులకు హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా ఈనెల 19 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఉపాధ్యాయుల గైర్హాజరుపై ఎంఈవో వెంకటసుబ్బయ్యను వివరణ కోరగా ఈ విషయంపై ప్రధానోపాధ్యాయురాలితో మాట్లాడతానని తెలిపారు.

భారత్-పాకిస్థాన్ కాల్పుల విరమణ ప్రకటించాయని

ట్రంప్ చెప్పడం విడ్డూరం : సీపీఐ

రాయచోటిటౌన్, మే14(ఆంధ్రజ్యోతి):జమ్మూకశ్మీర్‌లో ఉగ్రమూకల అమానుష్యంపై చేస్తున్న యుద్ధంలో భాగంగా భారత్-పాకిస్థాన్ కాల్పుల విరమణ ప్రకటించాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పడం విడ్డూరంగా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య పేర్కొన్నారు. బుధవారం సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇరుదేశాలు కాల్పుల విరమణ ప్రకటించాయని మన దేశ రాష్ట్రపతి గానీ, రక్షణ శాఖ మంత్రి గానీ, ప్రధాని గానీ ప్రకటించకుండా ట్రంపు ప్రకటించడం చూస్తే భారతదేశ సార్వభౌమాధికారాన్ని తాకట్టు పెట్టినట్లుగా ఉందన్నారు. భారతదేశ సార్వభౌమాధికారాన్ని అమెరికాలో ఉన్న ట్రంప్ నిర్ణయించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి పాల్గొన్నారు.

అదనపు సహాయాన్ని సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న హౌసింగ్ ఏడీ సాంబశివరావు

రామాపురం, మే14(ఆంధ్రజ్యోతి):పక్కా గృహాల లబ్ధిదారులు అదనపు సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని హౌసింగ్ పీడీ సాంబశివరావు అన్నారు. స్థానిక ఎంపీడీవో సభా భవనంలో బుధవారం సచివాలయ అసిస్టెంట్ ఇంజనీర్లకు జరిగిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. హౌసింగ్ ఏఈ, సచివాలయ అసిస్టెంట్ ఇంజనీర్లు బాధ్యత తీసుకొని త్వరితగతిన పూర్తి చేయించాలన్నారు. ఎంపీడీవో జాహువా, హౌసింగ్ ఏఈ కేఎన్ఎం ప్రసాద్, సచివాలయ అసిస్టెంట్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

అలరించిన బాలనాగమ్మ నాటకం

రాజంపేట, మే 14 (ఆంధ్రజ్యోతి): పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల 617వ జయంతి వేడుకలు సందర్భంగా బుధవారం సాయంత్రం అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాక గ్రామంలో అన్నమయ్య, బాలనాగమ్మ నాటక ప్రదర్శన అలరించింది. బోయనపల్లె కోదండరామ కళా నాట్యమండలి ఆధ్వర్యంలో టీఎం నాగమణి బృందం నిర్వహించిన హరికథ ఆకర్షించింది. అన్నమయ్య జయంతి సందర్భంగా మూడు రోజుల పాటు నిర్వహించిన కార్యక్రమాలు ముగిశాయి.

ఇకనైనా సత్ప్రవర్తనతో మెలగండి: రేంజర్

సిద్దవటం, మే 14 (ఆంధ్రజ్యోతి) : ఇకనైనా సత్ప్రవర్తనతో మెలగాలని ఎర్రచందనం కేసుల్లో పాత నిందితులకు అటవీ శాఖ రేంజర్ కళావతి సూచించారు. బుధవారం సిద్దవటం అటవీశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌన్సెలింగ్ సమావేశంలో రేంజర్ బి.కళావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈసీ మనీకి ఆశపడి మళ్లీ నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రపంచంలోనే అత్యంత అరుదైన ఎర్రచందనాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడితే ఎంతటివారినైనా ఉపేక్షించమని హెచ్చరించారు. ఎర్రచందనం స్మగ్లింగ్‌కు పాల్పడినవారిపై తీసుకునే చర్యలు, విధించే శిక్షలు, పర్యావరణానికి కలిగే నష్టం వంటి విషయాలపై అవగాహన కల్పించారు.

ప్రశాంతంగా సప్లిమెంటరీ పరీక్షలు

ఓబులవారిపల్లె, మే 14 (ఆంధ్రజ్యోతి): చిన్నఓరంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని ప్రిన్సిపాల్ డీఆర్ హరిత తెలిపారు. పుల్లంపేట, ఓబులవారిపల్లె మండలాల పరిధిలోని ఇంటర్ కళాశాలల్లో విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారన్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నామన్నారు.

నేడు వైసీపల్లె ఉపసర్పంచ్ ఎన్నిక

నందలూరు, మే 14 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈనెల 15న మండలంలోని వైసీపల్లె పంచాయతీ ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీవో రాధాకృష్ణంరాజు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా 15వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి వైసీపీల్లె పంచాయతీ వార్డు సభ్యులందరు తప్పక హాజరు కావాలని కోరారు.

వైభవంగా పోతులరాజు ఊరేగింపు

పెనగలూరు, మే 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓబిలి హరిజనవాడలో గంగమ్మ జాతర సందర్భంగా బుధవారం రాత్రి గ్రామ పురవీధుల్లో పోతులరాజు ఊరేగింపు వైభవంగా జరిగింది. ఈ ఊరేగింపులోనే అమ్మకు బలి ఇచ్చే ప్రధాన దున్నపోతును ఊరేగించారు. ఇంటింటి వద్ద దున్నపోతుకు పసుపు నీరు పోసి నవధాన్యాలను తినిపించారు ఇదిలా ఉండగా వేములయ్య బృందంచే గంగమ్మ ఆసాది కథను వినిపించారు. ఇదిలా ఉండా 70 ఏళ్ల తర్వాత గ్రామంలో జాతర జరుగుతుండడంతో ఊరంతా పచ్చ తోరణాలు, షామియాన పందిర్లు, వీధులన్ని విద్యుత్‌కాంతుల వెలుగులు, అమ్మవారి కటౌట్‌లతో దేదీప్యమానంగా వెలుగుతోంది. గ్రామ చివరన ఉన్న గంగమ్మదేవాలయంలో మూలవిరాట్‌కు మకరతోరణం ఏర్పాటు చేసి సువాసన పూలమాలలతో తీర్చిదిద్దారు.

భుజంగేశ్వర స్వామి ఆలయ

పాలక మండలి ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

రైల్వేకోడూరు, మే 14(ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డున వెలసిన భుంజగేశ్వర స్వామి ఆలయం పాలక మండలి ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవాలని ఈవో కొండారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ఆలయంలోని నోటీసు బోర్డులో నోటిఫికేషన్ అంటించినట్లు కొండారెడ్డి ఆ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నోటిఫికేషన్ వచ్చిన 20 రోజుల లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అన్నదాత సుఖీభవకు దరఖాస్తు చేసుకోండి

పెనగలూరు, మే 14 (ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్, రైతుభరోసా పథకాలకు రైతులు ఈనెల 20 లోపు రైతుసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఏవో సుబ్రమణ్యం తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా రూ.20 వేలు మూడు విడతల్లో నేరుగా రైతు ఖాతాలో జమ అవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 14 వేలు, కేంద్ర ప్రభుత్వం 6 వేలు జమ చేస్తుందన్నారు. రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌బుక్, 1బి వివరాలతో రైతుసేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లపై వివక్ష తగదు



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

రాయచోటి(కలెక్టరేట్), మే14(ఆంధ్రజ్యోతి): కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లపై వివక్షత తగదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం వారు కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడూతూ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను రాత్రి 8 గంటలకు ఎక్కడో ఊరి బయట పొలిమేరల్లో ఉన్న హెల్త్ సెంటర్‌కు వెళ్లి అటెండెన్స్ వేయాలని ఆజ్ఞాపించడం ఎంతవరకు సబబు అన్నారు. వారికి రక్షణకు బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. ఇందుకు సంబంధించిన సర్క్యులర్‌ను వెనక్కి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సాల్మన్, అహ్మద్‌బాషా, శివకుమార్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి సొప్పలమ్మ తిరునాళ్లు

లక్కిరెడ్డిపల్లె, మే14(ఆంధ్రజ్యోతి): మండలంలోని బీ.యర్రగుడి పంచాయతీ కొండవాండ్లపల్లెలో వెలిసిన సొప్పలమ్మ తిరునాళ్లు ఈ నెల 17 నుంచి ప్రారంభమవుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 17వ తేదీ నిండు తిరునాళ్ల, అన్నదానం, అలాగే బండలాగుడు పోటీలు ఉంటాయని కమిటీ సభ్యులు వివరించారు.

భక్తుల కొంగు బంగారం కొత్తపురమ్మ తల్లి



కొత్తపురమ్మ తల్లి



సిద్దలపూజ నిర్వహిస్తున్న భక్తులు

సంబేపల్లె, మే14(ఆంధ్రజ్యోతి): భక్తుల కొంగు బంగారంగా కొత్తపురమ్మ తల్లి పూజలందుకుంటున్నారు.బుధవారం జాతర సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. ఉదయం పుట్ట బంగారం తెచ్చి పూజలు చేశారు. మధ్యాహ్నం అమ్మవారి జీవిత చరిత్రను వినిపించారు. అనంతరం అమ్మవారికి సిద్దల పూజలు నిర్వహించారు. బుధవారం రాత్రి అమ్మవారి దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి జనం హాజరవుతారు. అనంతరం భక్తులు కట్టిన చాందినీ బండ్లతో ఆలయ ప్రాంగణం కళకళలాడుతుంది. అనంతరం గురువారం అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకోనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం రాత్రి అమ్మవారి కళ్ల పాటు కార్యక్రమంతో జాతర ముగుస్తుందని వారు వివరించారు.



ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
రాజంపేట - A.C.O.: 99854 11312 | రాయచోటి - A.C.O.: 63006 38887 | రాయచోటి - S.R.: 99858 65573 | రైల్వేకోడూరు - S.R.: 98854 12462 | D.C.M.: 99854 11184

ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగవా.. రామా...!

- ఇబ్బందులు పడుతున్న రామ భక్తులు
- ఒంటిమిట్టలో రైళ్లు ఆపాలంటూ వినతులు

ఒంటిమిట్ట, మే 14 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రా భద్రాద్రిగా పేరుగాంచిన ఒంటిమిట్టలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగకపోవడంతో రామభక్తులు అవస్థలు పడుతున్నారు. రాష్ట్రం విడిపోవడంతో 2015లో ఒంటిమిట్ట కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం తరపున నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆలయ అభివృద్ధి కొరకు ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయాన్ని టీటీడీలో విలీనం చేసింది. టీటీడీ వారు 100 కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి పనులు చేస్తున్నారు. పలు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఒంటిమిట్ట కోదండరాముడి దర్శనానికి విచ్చేస్తున్నారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ తదితర రాష్ట్రాల నుంచి భక్తులు విచ్చేస్తున్నారు. కానీ ఒంటిమిట్టలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒంటిమిట్ట మీదుగా పలు రాష్ట్రాలకు ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయి. వీటిలో కొన్ని రైళ్లు అయినా ఒంటిమిట్టలో నిలిపితే భక్తులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. ప్రస్తుతం ఒంటిమిట్ట రైల్వేస్టేషన్‌లో అరక్కోణం, హుబ్లీ, డెమో ప్యాసింజర్ రైళ్లు మాత్రమే ఆగుతున్నాయి. దూర ప్రాంతాల నుంచి ఒంటిమిట్ట కోదండరాముడి దర్శనానికి విచ్చేయాలంటే రైళ్ల సౌకర్యం లేకపోవడంతో పలువురు భక్తులు రాలేకపోతున్నారు. ప్రతిరోజూ సుమారు 10 వేల లోపు భక్తులు కోదండరాముడిని దర్శించుకుంటున్నారు. రైళ్ల సౌకర్యం ఏర్పడితే భక్తుల తాకిడి ఇంకా పెరిగే అవకాశం ఉంటుంది. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో జరిగిన కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాలకు ప్రతిరోజూ ఐదు వేలకు మందికి పైగా ఒంటిమిట్టలో ఆగే రైళ్లల్లో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాల్లో రైల్వే శాఖకు సుమారు 1.50 లక్షల రూపాయలు ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. అదే ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఇక్కడ ఆగితే మరింత ఆదాయం వచ్చే అవకాశం ఉందని రైల్వే అధికారులు చెబుతున్నారు. ఒంటిమిట్ట మండలంలో ప్రధానంగా రైతులు చీనీ, నిమ్మ పంటలను సాగు చేస్తున్నారు. ఈ పంటలను రైతులు కేరళ రాష్ట్రంలోని ఎర్నాకులంకు పంపిస్తూ ఉంటారు. వ్యాపార లావాదేవీల కోసం ఇక్కడ రైతులు ఎర్నాకులానికి వెళుతుంటారు. అలాగే చెన్నై, విజయవాడ తదితర ప్రాంతలకు కూడా ఈ పంటను పంపిస్తున్నారు. రైళ్ల స్టాపింగ్ లేకపోవడంతో వీరంతా చాలి ఇబ్బందులు పడుతున్నారు. అలాగే మండలంలో చేనేత కార్మికులు అధిక సంఖ్యలో ఉన్నారు. వీరు చెన్నై, విజయవాడ, హైదరాబాదు, కాకినాడ, విశాఖపట్టణం తదితర ప్రాంతాలకు వ్యాపార నిమిత్తం వెళుతుంటారు. వీరు కూడా ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పది సంవత్సరాలుగా ఒంటిమిట్టలో ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని పలువురు భక్తులు రైల్వేశాఖ అధికారులకు విన్నవించినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఒంటిమిట్టలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేలా చర్యలు తీసుకోవాలని రామ భక్తులు, రైతులు, చేనేత కార్మికులు కోరుతున్నారు.





రాముడి దర్శనం ఎంతోమందికి దక్కుతుంది



ఒంటిమిట్టలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిపితే కోదండరాముని దర్శనం ఎంతోమందికి దక్కుతుంది. రాముడిని దర్శించుకోవాలని ఉన్నా వచ్చేందుకు రైళ్ల సౌకర్యం లేకపోవడంతో దూర ప్రాంత గ్రామ భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళతాము.

- బొబ్బిలి సుబ్బరాయుడు, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి, ఒంటిమిట్ట

భక్తులకు ఇబ్బందులు తప్పుతాయి



ఒంటిమిట్టలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగితే రామ భక్తులకు ఇబ్బంది లేకుండా ఉంటుంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు సౌకర్యవంతంగా ఉంటుంది. రైల్వే అధికారులు దీనిపై దృష్టి సారించి రైళ్లు ఆగేలా చర్యలు తీసుకుంటే బాగుంటుంది.

- వీణా రాఘవాచార్యులు, ఆలయ ప్రధాన అర్చకులు

రైతులకు ఎంతో ఉపయోగం



ఒంటిమిట్టలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగితే మండల రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. కేరళ, చెన్నై, తెలంగాణ తదితర రాష్ట్రాలకు ఇక్కడి రైతులు వ్యాపారం కోసం వెళుతుంటారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు.

- కట్టా యానాదయ్య, జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు

భక్తుల కోసం ఆపాలి



ఒంటిమిట్ట కోదండరామ స్వామిని దర్శించుకునేందుకు విచ్చేసే భక్తుల కోసం ఒంటిమిట్టలో ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలపాలి. రైళ్లు నిలిపితే ప్రతి ఒక్కరికీ సౌకర్యంగా ఉంటుంది. భక్తుల తాకిడి కూడా పెరిగే అవకాశం ఉంటుంది

- ఎస్వీ రమణ, ప్రముఖ కాంట్రాక్టర్, ఒంటిమిట్ట

ఈసారైనా స్పందిస్తారా..?

- అకాల వర్షాలతో నష్టపోయిన రైతులు
- దాహంతో అల్లాడుతున్న జనం
- గళం విప్పని ప్రజాప్రతినిధులు
- నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం

(5వ పేజీ తరువాయి)

మూగజీవాలు దాహంతో అల్లాడుతున్నాయి. పశువుల దాహాన్ని తీర్చేందుకు ఏర్పాటుచేస్తున్న తాగునీటి తొట్టెల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి.

గిట్టుబాటు ధర కల్పిస్తారా..

రబీలో సాగుచేసిన వరి పంటల నూర్పిళ్లు దాదాపు పూర్తై ధాన్యాన్ని రైతులు అమ్ముకుంటున్నారు. పంటకు తగిన గిట్టుబాటు ధర లభించడం లేదని రైతులు వాపోతున్నారు. పైగా వ్యాపారులు తూకంలో దగా చేస్తుండడంతో రైతులు లబోదిబోమంటున్నారు. వీటికి పరిష్కారం చూపాల్సిన గురుతర బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులపై ఉంది.

ఖనిజ దోపిడీని అరికట్టేనా..

జిల్లాలో ఖనిజదోపిడీ యథేచ్ఛగా కొనసాగుతోంది. ముగ్గురాయి, సున్నపురాయి, గ్రావెల్, మట్టి తదితర వాటిని అన్ని పార్టీల వారూ అక్రమంగా తరలిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు. అనుమతులు లేకుండానే కొండలను, గుట్టలను తవ్వి గుల్లచేస్తున్నా అధికారులు చేష్టలుడిగి చూస్తున్నారు. ఈ అక్రమాలకు కళ్లెం వేయాల్సిన అవసరం ఉంది.

శాఖల వారీగా..

- పశుసంవర్ధకశాఖలో పశువైద్యం గాలిలో దీపంలా మారింది. అధికారులు అందుబాటులో ఉండడం లేదని రైతులు వాపోతున్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2024-25కు గాను ఉమ్మడి జిల్లాకు 875 గోకులం షెడ్లను మంజూరు చేసింది. వీటిలో చాలా వరకు అనర్హులు నిర్మించుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పశుగ్రాస విత్తన సరఫరా అంతంతమాత్రమే సాగుతోంది. పెయ్యదూడల సంఖ్య పెంపు గణాంకాలకే పరిమితమవుతోంది. వీటిపై చర్చించాల్సిన అవసరం ఉంది.
- జిల్లా స్త్రీ, శిశుసంక్షేమశాఖ ద్వారా జిల్లాలో సాగుతున్న అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు బాలారిష్టాలు పట్టుకున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలలో మరుగుదొడ్ల నిర్మాణాలు నాణ్యతా లోపంగా కొనసాగుతున్నాయి. బాల సంజీవని పథకం కిట్స్ పక్కదారి పడుతున్నాయి.
- పంచాయతీరాజ్‌శాఖలో సిమెంట్ రోడ్లు, తారు రోడ్లు, మెటల్ రోడ్లు, కాంపౌండ్ వాల్ తదితర మొత్తం 999 పనులను రూ.8,017.21 లక్షలతో ప్రారంభించారు. వాటి బిల్లులతో పాటు ఉపాధి హామీ పథకం ఫేజ్ 1, 2, 3 కింద చేపట్టిన పలు పనులకు బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతుండంతో కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారు.
- పంచాయతీశాఖ పరిధిలోని చాలా గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. 2024-25కు గాను 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా చేపట్టిన పనులు నాసిరకంగా ఉన్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే జిల్లాలోని 16 పంచాయతీల్లో దాదాపు రూ.3 కోట్లను పక్కదారి పట్టించారు. పన్ను వసూళ్లలో సిబ్బంది చేతివాటాన్ని ప్రదర్శిస్తు ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. వేతనాలను సక్రమంగా చెల్లించలేదని క్లాప్ మిత్రలు ఆందోళన చెందుతున్నారు. వీటన్నింటిపై జడ్పీ సర్వసభ్య సమావేశంలో చర్చ సాగించి పరిష్కారం చూపుతారని జనం గంపెడాశతో ఎదురుస్తున్నారు.

నైపుణ్యంతో నేరగాళ్లను గుర్తించండి

శిక్షణ కార్యక్రమంలో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



శిక్షణలో మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యంతో నేరగాళ్లను గుర్తించడంతో పాటు సాంకేతిక పరిజ్ఞానంతో నేరగాళ్ల ఎత్తుగడలకు అడ్డుకట్ట వేస్తూ జిల్లాలో నేరాల కట్టడికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. బుధవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఫోరెన్సిక్ సైన్స్ ఎవిడెన్స్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేరం చేసిన వ్యక్తి శిక్ష నుంచి తప్పించుకోకుండా నేర స్థలంలో సాక్ష్యాధారాల సేకరణ, వాటి భద్రతా ప్రమాణాలు ఎలా పాటించాలనే విషయాలపై ప్రత్యేక శ్రద్ధ ఉంచాలని తెలియజేశారు. ఫోరెన్సిక్ సైన్స్‌లో గల అన్ని విభాగాలకు సంబంధించి నిష్ణాతులైన వారితో ఈ శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో రాజంపేట సబ్ డివిజన్ ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్‌హెగ్డే, విజయవాడ ఫోరెన్సిక్ నిపుణులు కిరణ్‌కుమార్, మురళి, అనంతపురం ఆర్‌ఎఫ్‌ఎస్‌ఎల్ అధికారులు జయరాజు, కుళాయమ్మ, జిల్లాలోని సీఐలు, ఆర్‌ఐలు, ఎస్ఐలు, ఆర్‌ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచిత స్పోకెన్ ఇంగ్లీషు, కెరీర్ కౌన్సెలింగ్ తరగతులు

రాయచోటి, మే 14 (ఆంధ్రజ్యోతి): పినాక ప్రజా సాధికార ట్రస్టు, ఐఆర్ఎస్ అధికారి బి.యాదగిరి ఆధ్వర్యంలో బుధవారం నుంచి జూన్ 4వ తేదీ వరకు 21 రోజులపాటు ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్, కెరీర్ కౌన్సెలింగ్, జీవన నైపుణ్యాలు, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ తరగతులను రాయచోటి, మదనపల్లె పట్టణాల్లో నిర్వహించనున్నారు. ఈ తరగతుల్లో బి.యాదగిరి 'జీవన నైపుణ్యాలు, సివిల్ సర్వీస్ పరీక్షల తయారీకి దిశానిర్దేశం, డిబేట్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూలను ఎలా ఎదుర్కోవాలి' అనే అంశాలపై బోధిస్తారు. మానసిక వ్యక్తిత్వ వికాస శిక్షకులు, పినాక సీఈవో కొల్లి రాజారాం విద్యార్థులకు తరగతులు తీసుకుంటారు. వీరితో పాటు జీవితంలోని వివిధ రంగాలలో విజయం సాధించిన వ్యక్తులు తమ అనుభవాలను వివరిస్తారు. అనుభవజ్ఞులైన శిక్షకులతో స్పోకెన్ ఇంగ్లీష్, కాంపిటీటివ్ ఇంగ్లీషు తరగతులు నిర్వహిస్తారు. డిగ్రీ, పీజీ, బీటెక్ చదివిన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని నిర్వాహకులు కోరారు.

మదనపల్లె పట్టణం ప్రశాంత్‌నగర్‌లోని జ్ఞానోదయ ఇంగ్లీషు మీడియం హైస్కూల్ ఆవరణలో ఈ తరగతులు నిర్వహిస్తారు. టీవీ-45 చైర్మన్ వలిగట్ల రెడ్డెప్ప చీఫ్ ప్యాట్రన్‌గా, లలితకుమారి, రేణుక, రెడ్డెప్పలు డైరెక్టర్లుగా వ్యవహరిస్తారు.

రాయచోటి పట్టణంలోని శ్రీషిరిడీ సాయి మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో జరిగే తరగతులకు ముఖ్య ప్యాట్రన్‌గా రాయచోటి కీస్ సొసైటీ, కె.రఘునాథ, గౌనిపల్లె శివ డైరెక్టర్లుగా వ్యవహరిస్తారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రోజూ తరగతులు జరుగుతాయి. ప్రతి సెంటర్‌లో 100 మంది విద్యార్థులకు అవకాశం ఉంటుంది విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్‌తో పాటు మధ్యాహ్న భోజనం, దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ఉచిత హాస్టల్ వసతి కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మెరుగైన సేవలు అందించాలి : మంత్రి

రాయచోటిటౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలను అందించాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం రాయచోటి పట్టణంలోని ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయంలో రూ.10 లక్షలతో రీమోడల్ చేసిన ఎస్ఈ కార్యాలయాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని మారుమూల గ్రామాలకు సైతం మెరుగైన విద్యుత్ అందిస్తోందన్నారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. విద్యుత్ అధికారులకు ఎటువంటి సమస్యలున్నా వెంటనే తమకు తెలియజేసి పరిష్కరించుకోవచ్చునన్నారు. జిల్లా ఏర్పడిన అనంతరం రాయచోటి పట్టణంలో ఏపీఎస్పీడీసీఎల్ నూతన ఎస్ఈ కార్యాలయం ఏర్పాటు చేశామని, నూతన ఎస్ఈ ఛాంబర్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్ఈ నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

అప్రమత్తం చేసేందుకే మాక్‌డ్రిల్



బస్టాండులో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపకశాఖాధికారులు

రాయచోటిటౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): యుద్ధం అనివార్యమైనప్పుడు ప్రజలు ఏ విధంగా దానిని ఎదుర్కోవాలో తెలిపేందుకే అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో సివిల్ మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. బుధవారం రాయచోటిలోని ఆర్టీసీ బస్టాండులో రెవెన్యూ, పోలీసు, వైద్య ఆరోగ్యశాఖ, అగ్నిమాపక శాఖల ఆధ్వర్యంలో సివిల్ మాక్ డ్రిల్ విజయవంతంగా నిర్వహించారు. శత్రుదేశం నుంచి మన దేశంలోని ఏ ప్రాంతం మీదైనా దాడి జరిగినప్పుడు ఏ విధంగా ఎదుర్కోవాలో తెలియజేసేందుకే ఈ మాక్‌డ్రిల్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో శ్రీనివాస్ మాట్లాడుతూ యుద్ధం వచ్చినప్పుడు ప్రజలు తమని తాము ఎలా రక్షించుకోవాలి అని తెలియజెప్పే కార్యక్రమమే సివిల్ మాక్ డ్రిల్ అని చెప్పారు. జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి అనిల్‌కుమార్ మాట్లాడుతూ సివిల్ మాక్‌డ్రిల్ కార్యక్రమాన్ని బుధవారం ఉదయం 11 గంటలకు సైరన్ మోగించి ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో రాయచోటి తహసీల్దార్ నరసింహకుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఉషశ్రీ, ఎస్డీఆర్‌ఎఫ్ సిబ్బంది, పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షా కేంద్రం తనిఖీ

పీలేరురూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను కడప ఆర్జేడీ ఎ.శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. బుధవారం ఆయన పీలేరు ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలల్లో జరుగుతున్న పరీక్షలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో నిబద్ధతతో వ్యవహరించాలని, నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

పరీక్షా కేంద్రాల్లో సౌకర్యాలు, విద్యార్థులకు అందించాల్సిన మౌలిక వసతులు తదితర ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఆర్జేడీ వెంట ఎగ్జామినేషన్ చీఫ్ సూపరింటెండెంట్లు వై.వెంకటరెడ్డి, బి.రెడ్డెప్ప, జిల్లా ఎగ్జామినేషన్ కమిటీ సభ్యుడు నాగ సురేష్, సిట్టింగ్ స్క్వాడ్ సభ్యుడు భాస్కర్, డిపార్ట్‌మెంటల్ అధికారులు వెంకటరమణ, బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

31 మంది ఎస్ఐల బదిలీ

- ఉత్తర్వులు జారీ చేసిన ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంతో పాటు జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్‌స్టేషన్‌లలో పనిచేస్తున్న 31 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ బుధవారం ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా హెడ్ క్వార్టర్‌లో ఉన్న విష్ణువర్ధన్‌ను రాయచోటి అర్బన్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ-1గా, ఇక్కడ పనిచేస్తున్న నరసింహారెడ్డిని జిల్లా హెడ్‌క్వార్టర్స్‌లోని సైబర్ క్రైమ్ ఎస్ఐగా, రాయచోటి అర్బన్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ-2గా పనిచేస్తున్న మహమ్మద్ అబ్దుల్ జహీర్‌ను జిల్లా హెడ్ క్వార్టర్‌లోని డీఎస్‌బీ ఎస్ఐ-1గా, పీలేరు అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ-2గా ఉన్న లోకేశ్‌ను రాయచోటి అర్బన్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ-2గా బదిలీ చేశారు. అలాగే వీఆర్‌లో ఉన్న బాలాజీనాయక్‌ను పీలేరు అర్బన్‌స్టేషన్ ఎస్ఐ-2గా, సైబర్ క్రైమ్ ఎస్ఐగా ఉన్న టీవీఎస్ చిరంజీవిని వీరబల్లి ఎస్ఐగా, వీరబల్లి ఎస్ఐమోహన్‌నాయక్‌ను సీసీఎస్ ఎస్ఐ-3గా, వీఆర్‌లో ఉన్న మల్లికార్జునరెడ్డిని నందలూరు ఎస్ఐగా, గుర్రంకొండ ఎస్ఐ మధురామచంద్రుడును డీసీఆర్బీ ఎస్ఐ-1గా, వీఆర్‌లో ఉన్న వెంకటేశ్‌ను రాజంపేట అర్బన్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ-1గా, వీఆర్‌లో ఉన్న రాందాస్‌ను రాజంపేట అర్బన్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ-2గా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. అలాగే రాజంపేట అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ1గా ఉన్న లక్ష్మిప్రసాద్‌రెడ్డిని రైల్వేకోడూరు అర్బన్ ఎస్ఐగా, రైల్వేకోడూరు అర్బన్ ఎస్ఐ నవీన్‌బాబును గుర్రంకొండ ఎస్ఐగా, డీసీఆర్బీ ఎస్ఐగా ఉన్న శివకుమార్‌ను పుల్లంపేట ఎస్ఐగా, డీసీఆర్బీ ఎస్ఐ-2గా ఉన్న అన్వర్‌బాషాను మదనపల్లె వన్‌టౌన్ పీఎస్ ఎస్ఐ-2గా బదిలీ చేశారు.

మదనపల్లె వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ2గా పనిచేస్తున్న శ్రీనివాస్‌నాయక్‌ను రాయచోటి ఉమెన్స్ పీఎస్ ఎస్ఐ-3గా, వీఆర్‌లో ఉన్న బాలరాజును ఉమెన్స్ పీఎస్ ఎస్ఐ-4గా, మదనపల్లె అర్బన్ తాలూకా పీఎస్‌లో ఎస్ఐ-2 చంద్రమోహన్‌ను మదనపల్లె తాలూకా పోలీస్‌స్టేషన్ ఎస్ఐ-1, మదనపల్లె తాలూకా పోలీస్‌స్టేషన్ ఎస్ఐ-1 హరిప్రసాద్‌ను పీటీఎం పోలీస్‌స్టేషన్ ఎస్ఐ-1గా, మదనపల్లె తాలూకా ఎస్ఐ-1 హరిహరప్రసాద్‌ను పీటీఎం పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా, మదనపల్లె టూటౌన్ ఎస్ఐ-2 గాయత్రిని మదనపల్లె తాలూకా పోలీస్‌స్టేషన్ ఎస్ఐ-2గా బదిలీ చేశారు. వీఆర్‌లో ఉన్న శ్రీనాథ్ ప్రసాద్‌ను మదనపల్లె టూ టౌన్ ఎస్ఐ-2గా, పీటీఎం ఎస్ఐ రవికుమార్‌ను రామసముద్రం ఎస్ఐగా, వీఆర్‌వోలో ఉన్న ఉమామహేశ్వరిని తంబళ్లపల్లె ఎస్ఐగా, వీఆర్‌లో ఉన్న వెంకటేశ్వర్లును పెద్దమండెం ఎస్ఐగా, డీఎస్ఈ ఎస్ఐ-1గా ఉన్న శ్రీనివాసులరెడ్డిని అన్నమయ్య డీఎస్‌బీ ఎస్ఐ-2గా బదిలీ చేశారు. అలాగే పెద్దమండెం ఎస్ఐగా ఉన్న పీవీ రమణను డీఎస్‌బీ ఎస్ఐ-3గా, వీఆర్‌లో ఉన్న సూర్యనారాయణను డీఎస్‌బీ ఎస్ఐ-4గా, వీఆర్‌లో ఉన్న సుబ్రమణ్యం నాయక్‌ను డీఎస్‌బీ ఎస్ఐ-5గా, వీఆర్‌లో ఉన్న జయరామప్పను డీసీఆర్‌బీ ఎస్ఐ-2గా వీఆర్‌లో ఉన్న శివకామినీని పీసీఆర్ ఎస్ఐ-2గా నియమిస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. వారికి కేటాయించిన పోలీస్‌స్టేషన్‌లలో రిపోర్టు చేయాలని ఆదేశించారు.

స్కూల్ అసిస్టెంట్లను డిమోషన్ చేయడం సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ

మదనపల్లెటౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): ఉన్నత పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న స్కూల్ అసిస్టెంట్లను డిమోషన్ చేసి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులుగా మార్చడం సరికాదని ఏపీ ఉపాధ్యాయుల సంఘం (ఏపీఏఎస్) రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ విమర్శించారు. బుధవారం స్థానిక ఆపస్ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 19 ప్రకారం మిగులు స్కూల్ అసిస్టెంట్లను ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలుగా మార్చడం అవమానపరిచినట్లు ఉందన్నారు. ఈ జీవో అసంబద్ధంగా ఉందని, ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని, ప్రతి 20 మంది విద్యార్థులకు ఒక ఎస్జీటీని నియమించాలని డిమాండ్ చేశారు. ఆపస్ జిల్లా అధ్యక్షుడు నరసింహులు, కార్యదర్శి రమణారెడ్డి మాట్లాడారు. సమావేశంలో ఆపస్ నాయకులు రెడ్డి రాజేశ్వరి, రెడ్డిశేఖర్, సిద్దారెడ్డి, రమణ, కొండారెడ్డి, గిరీష్, గోపాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్‌లో మదనపల్లె విద్యార్థికి జిల్లా ఫస్ట్ ర్యాంకు



కార్తీక్

మదనపల్లె టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన పాలిసెట్ ఫలితాల్లో మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెకు చెందిన చేనేత కార్మికుడు వెంకటసుబ్బయ్య, శైలజ కుమారుడు బి.కార్తీక్ 117/120 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 188వ ర్యాంకు సాధించాడు. జిల్లాలో ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించగా అందులో కార్తీక్ 188వ ర్యాంకుతో జిల్లాలో ఫస్ట్ ర్యాంకు సాధించాడు. ఎం.రెడ్డిరచన 117/120 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 277 ర్యాంకు, ఒ.మహ్మద్ అఫ్సాన్ 114/120 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 601 ర్యాంకు సాధించాడు. ఇదిలా వుండగా జిల్లా వ్యాప్తంగా 3981 మంది పాలిసెట్ పరీక్షకు హాజరు కాగా వీరిలో 3,768 మంది అర్హత సాధించారు.

ఘనంగా మహా చండీ హోమం



రెడ్డెమ్మకొండలో మహా చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

గుర్రంకొండ, మే 14 (ఆంధ్రజ్యోతి): సంతానలక్ష్మీ రెడ్డెమ్మ అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ మహాకుంభాభిషేకం మహోత్సవంలో భాగంగా బుధవారం మహాచండీ హోమాన్ని వేదపండితులు ఘనంగా నిర్వహించారు. రెండవ రోజు ఉదయాన్నే దేవత ఉత్థాపనం, పంచామృత స్నపనం, దీక్షా హోమం, యంత్రప్రతిష్ఠ, మూలమంత్రహవనం, వాస్తు హోమం, మహా చండీహోమాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. వారికి తీర్థప్రసాదాలను అందజేసి అన్నదాన కార్యక్రమాలను చేశారు. కార్యక్రమంలో ఈవో మంజుల, ఎంపీటీసీ రెడ్డిప్రసాద్‌నాయుడు, సర్పంచ్ ప్రేమకుమారి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రచందనం కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలుశిక్ష



నిందితుడు ఆదినారాయణరాజు

రాయచోటిటౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో నిందితుడికి 5 సంవత్సరాల జైలుశిక్షతో పాటు రూ.6 లక్షల జరిమానా విధిస్తూ తిరుపతి కోర్టు ఇచ్చిందని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. పీలేరు మండలం మారంరెడ్డిగారిపల్లె ఎర్రగుంట్లపల్లెకు చెందిన అరవ వెంకట ఆదినారాయణరాజు 2021 సంవత్సరం జనవరి 11వ తేదీ రాత్రి 7 గంటల ప్రాంతంలో ఎర్రచందనాన్ని అక్రమ రవాణా చేస్తున్నట్లు సమాచారం రావడంతో అప్పటి వాల్మీకిపురం ఎస్ఐ వెంకటేశ్వర్లు వాహనాలు తనిఖీ చేసి ముగ్గురు నిందితులను పట్టుకున్నారన్నారు. ఎస్ఐ సమగ్ర నివేదికను కోర్టుకు సమర్పించగా ప్రస్తుతం ముగ్గురు నిందితుల్లో గుండ్లూరు చెంగల్‌రెడ్డి, దళారి నారాయణరాజులు కేసు విచారణ జరుగుతుండగా అనారోగ్యంతో మృతి చెందారని తెలిపారు. నిందితుడు వెంకట ఆదినారాయణరాజుపై విచారించిన జిల్లా అడిషనల్ న్యాయమూర్తి నరసింహమూర్తి ఐదేళ్ల జైలుశిక్షతో పాటు రూ.6 లక్షల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారన్నారు.

వైభవంగా రథోత్సవం



వెల్లాలలో శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి రథోత్సవం

● జనసంద్రమైన వెల్లాల క్షేత్రం

రాజుపాలెం, మే 14 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన వెల్లాల బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి రథోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారి రథాన్ని ప్రత్యేక పూల అలంకరణ చేశారు. ప్రత్యేక పూజలు, హోమం తదితర కార్యక్రమాల అనంతరం రథంపై ఉత్సవ విగ్రహాలను కూర్చోబెట్టి ఊరేగింపు మొదలుపెట్టారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా దేవదాయశాఖ సహాయ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్, ఆలయ ఈవో వెంకటరమణ, ఆలయ కమిటీ జీఎల్ నారాయణరెడ్డి, టీడీపీ నాయకులు తోట మహేశ్వర్‌రెడ్డి, మండల టీడీపీ నాయకులు చెమికల పురుషోత్తంరెడ్డి తదితరులు ప్రారంభించారు. మాడవీధుల్లో రథంపై ఊరేగుతున్న స్వామివారి దర్శనానికి తరలివచ్చిన భక్తులతో వెల్లాల పుణ్యక్షేత్రం జనసంద్రమైంది. రథోత్సవానికి హాజరైన భక్తులకు పది చోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం 3.30గంటలకు బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ వెంకటరమణ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

కడప ఎడ్లకు ప్రథమ బహుమతి

వెల్లాల చెన్నకేశవ సంజీవరాయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాష్ట్రస్థాయి సీనియర్ వృషభాలకు బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, మాజీ జడ్పీటీసీ తోట మహేశ్వ ర్‌రెడ్డి, బ్రహ్మోత్సవాల కమిటీ సభ్యులు ప్రారం భించారు. ఈ పోటీల్లో వైఎస్ఆర్ కడప జిల్లా చౌటపల్లెకు చెందిన మార్తల చంద్రఓబులరెడ్డి ఎడ్లు ప్రథమ స్థానంలో నిలిచి రూ.1.11 లక్షలు గెలుపొందాయి. రెండో స్థానంలో బోరెడ్డి కేశవరెడ్డి పెద్దకొట్టాల, సుంకి సురేందర్‌రెడ్డి ఎడ్లు రెండో బహుమతి రూ.75 వేలు, మూడో స్థానంలో నంద్యాల జిల్లా గుంపుర మండిన్నె కందుకూరు రాంభూపాల్‌రెడ్డి ఎడ్లకు రూ.50 వేలను కమిటీ సభ్యులు అందించారు.



బహుమతులు అందిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

డాక్టర్ వైఎస్సార్ ఏఎఫ్ఏయూ 12 విభాగాలకు ఏఐసీటీఈ అనుమతి

కడప ఎడ్యుకేషన్, మే 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో 2025-26 విద్యా సంవత్సరానికి 12 టెక్నికల్ విభాగాలన్నింటికి ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) నుంచి అనుమతి పొడిగింపు పొందినట్లు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జి.విశ్వనాథ్‌కుమార్ తెలిపారు. 2023లో మొదటిసారిగా లెటర్ ఆఫ్ అప్రూవల్ పొందిన ఈ విశ్వవిద్యాలయం ప్రతి సంవత్సరం అనుమతిని విజయవంతంగా పొందుతోందన్నారు. టెక్నికల్ విద్యలో తన అంకితభావాన్ని నిరూపించుకున్నట్లు స్పష్టం చేశారు. అనుమతి పొందిన విభాగాలలో స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (ఎస్‌పీఏ), కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ (సీఎఫ్ఏ) రెండూ ఉన్నాయన్నారు. ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, డిజిటల్ టెక్నిక్స్ ఫర్ డిజైన్ అండ్ ప్లానింగ్, ఫెసిలిటీస్ అండ్ సర్వీసెస్ ప్లానింగ్, గేమ్ డిజైన్ టెక్నాలజీస్, కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్, ఇంటీరియర్ డిజైన్, ఫైన్ ఆర్ట్స్ ప్రోగ్రాములు, అప్లైడ్ ఆర్ట్, ఆనిమేషన్, పెయింటింగ్, స్కల్ప్చర్, ఫొటోగ్రఫీ విభాగాలు ఉన్నాయన్నారు. 2025-26 విద్యా సంవ త్సరానికి పై 12 ప్రోగ్రాములకు ఏడీసెట్, ఈఏపీసెట్ ద్వారా ప్రవేశాలు పొందుటకు మార్గం సుగమం కానుందన్నారు. మరిన్ని వివరాలకు డబ్ల్యూడబ్ల్యూ డబ్ల్యూ.వైఎస్ఆర్ఏఎఫ్‌యూ.ఏసీ.ఇన్‌ను సందర్శించవచ్చని తెలిపారు.

ప్రొద్దుటూరు మున్సిపాలిటీ అక్రమాలపై ఉదాసీనత

● ఆరుగురు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులకు నోటీసులు

కలికిరి, మే 14 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపాలిటీ భవన నిర్మాణాలకు అనుమతులు జారీ చేయడం, అనంతరం కట్టడాల తీరుతెన్నులను పర్యవేక్షించడం కారణంగా జరిగిన అక్రమాలకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవడంలో ఉదాసీనత చూపించిన వ్యవహారం చివరికి రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలోని ఆరుగురు అధికారుల మెడకు చుట్టుకుంది. ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో నివాస కట్టడాలు, వాణిజ్య సముదాయాల నిర్మాణాలు, విద్యా సంస్థల భవనాల్లో అనేక అక్రమాలు చోటు చేసుకున్నట్లు విచారణలో వెల్లడయ్యింది. అందుకు బాధ్యులైన ప్రొద్దుటూరు మున్సిపాలిటీ అధికారులపై చర్యలు తీసుకోవడానికి సిఫారసులు అందాయి. అభియోగాలు నమోదైన వారిపై చర్యలకు ఉపక్రమించకుండా రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో పనిచేసే ఆరుగురు అధికారులు ఉదాసీనంగా వ్యవహరించారని గుర్తించారు. ప్రస్తుతం అక్రమార్కుల విషయాలు అటుంచితే ఉదాసీనంగా వ్యవహరించి చర్యలు తీసుకోవడానికి అడ్డుపడ్డ అధికారులకు ప్రభుత్వం బుధవారం నోటీసులు జారీ చేసింది. 15 రోజుల్లోగా అభియోగాలపై పూర్తి వివరణలు సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇలా నోటీసులు జారీ చేయబడిన వారిలో రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ సి సెక్షన్ సూపరింటెండెంట్, ప్రస్తుత వడ్డేశ్వరం మున్సిపల్ కమిషనరు జి.రమణారెడ్డి, ప్రస్తుత బాపట్ల మున్సిపల్ కమిషనర్ అప్పటి ఎంఏయూడీ సూపరింటెండెంట్ జి.రఘునాథరెడ్డి, ప్రస్తుతం కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనరు ఆర్‌జీవీ కృష్ణ, ప్రస్తుతం సెలవులో ఉన్న అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్ సత్యనారాయణ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలోని ఏ1 సహాయకులు షాలినీ దేవి, కె.ఇందిర వున్నారు. అక్రమార్కులను కాపాడబోయి వీరంతా అభియోగాలకు గురయ్యారని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్ర మున్సిపల్ వ్యవహారాలు, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ బుధవారం ఆరుగురికి విడివిడిగా నోటీసులు జారీ చేశారు.

ఏటీఎంలో చోరీకి యత్నం



వేలిముద్ర నమూనాలను సేకరిస్తున్న క్లూస్ టీం ఇన్‌స్పెక్టర్

ముద్దనూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక నాలుగు రోడ్ల కూడలిలోని వన్‌ఇండియా ఏటీఎంలో గుర్తుతెలియని దొంగలు చోరీకి యత్నించారు.పోలీసుల వివరాల మేరకు... బుధవారం తెల్లవారు జామున గుర్తుతెలియని వ్యక్తులు ఏటీఎం గదిలో కారంపొడి చల్లి క్యాష్ బాక్సు ఉన్న డోరును తెరిచారు. అయితే క్యాష్ బాక్సును తెరవడంలో విఫలమయ్యారు. సమాచారం అందిన వెంటనే సీఐ దస్తగిరి పోలీసు సిబ్బందితో కలసి ఏటీఎం వద్దకు వెళ్లి పరిశీలించారు. క్లూస్ టీం ఇన్‌స్పెక్టర్ రుక్మిణీదేవి ఏటీఎంను పరిశీలించి, పరీక్ష కోసం వేలిముద్రల నమూనాలను సేకరించినట్లు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం




ముద్దనూరు మే 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి జమ్మలమడుగు రహదారిలోని పులికోన మలుపు సమీపంలో బుధవారం తెల్లవారుజామున షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం అయ్యింది. స్థానికుల సమాచారం మేరకు... కొండాపురం మండలానికి చెందిన అహమ్మద్‌బాషా కారులో ముద్దనూరు మీదుగా నంద్యాలకు వెళుతున్నాడు. ఘాట్‌లో పులికోన మలుపు సమీపంలో కారు ఏసీలో షార్ట్ సర్క్యూట్ అయ్యింది. దీంతోమంటలు చెలరేగాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బంది వచ్చిమంటలను అదుపు చేశారు. అయితే అప్పటికీ కారు పూర్తి గా కాలిపోయింది. అయితే కారులో ఉన్న వారికి ఎటువంటి ప్రమాదం జరగలేదు.

18 టన్నుల చీనీకాయలు చోరీ

కొండాపురం, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లావనూరు గ్రామంలో తోటల్లోని చీనీకాయలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మూడురోజుల కిందట ఉమామహేశ్వరరెడ్డి అనే రైతు తోటలోని 12 టన్నుల చీనీకాయలు, లక్ష్మిరెడ్డి అనే రైతు తోటలోని 6 టన్నుల చీనీకాయలను రాత్రిపూట చెట్ల నుంచి కోసుకెళ్ళినట్లు రైతులు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.6లక్షల వరకు ఉంటుందని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.


రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతి చెందిన గంగరాజు

కలసపాడు, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లారెడ్డి పల్లెకు చెందిన గంగరాజు (25) అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బుధవారం గంగరాజు తన సొంత పనిపై ద్విచక్ర వాహనంలో ప్రకాశం జిల్లా గిద్దలూరుకు వెళ్తుండగా సంజీవరాయుని పేట వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అక్కడి పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని గిద్దలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్యతో పాటు రెండేళ్ల కుమారుడు ఉన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడు మృతి



ప్రొద్దుటూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు-ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డులోని సినీహబ్ ఎదుట గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడు. బుధవారం ఉదయం స్థానికులు రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. సుమారు 60 నుంచి 65 ఏళ్లలోపు ఉండవచ్చని, లైట్ బ్లూగళ్ల చొక్కా, పట్టెల లుంగీ ధరించి వున్నాడని తెలిపారు. ఎవరైనా గుర్తిస్తే రూరల్ సీఐ, ఎస్ఐలు 9121100597, 9121100598, 9121100599 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



వల్లూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తప్పెట్ల గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుగ్గాయపల్లె వెంకటాపురం గ్రామానికి చెందిన బాబాఫకృద్దీన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. తన సొంత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంలో కడపకు వెళుతుండగా కడప నుంచి కమలా పురం వైపు వస్తున్న లారీ ఢీకొనంతో రోడ్డుపై పడ్డాడు. అదే సమయంలో కమలాపురం వైపు నుంచి కడపకు వెళుతున్న మరో లారీ అతని కాళ్లపై ఎక్కింది. దీంతో కాలు విరిగి రక్తగాయాలయ్యాయి. 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. మెరుగైన చికిత్స కోసం ఏలూరు సీఎంసీకి తరలించినట్లు వారి బంధువులు తెలిపారు.

మహిళపై హత్యాయత్నం కేసులో.. ఐదేళ్లు జైలుశిక్ష, రూ.70వేలు జరిమానా

కడప క్రైం, మే 14 (ఆంధ్రజ్యోతి): తనకు డబ్బులు ఇవ్వకుండా నిరాక రించిన ఓ మహిళపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తికి కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.70వేలు జరిమానా విధించినట్లు వన్‌టౌన్ సీఐ బి.రామక్రిష్ణ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. సిద్దవటం మండలం మంగనవండ్ల గ్రామానికి చెందిన కారుమంచి సురేశ్ అనే వ్యక్తి తన అక్క వరుసైన సులోచన అనే మహిళ వద్ద అప్పుడప్పుడూ డబ్బులు తీసుకుం టుండేవాడు. ఈ క్రమంలో 2020 ఫిబ్రవరి 2న సులోచనను డబ్బులు ఇవ్వమని అడగ్గా ఆమె నిరాకరించింది. దీంతో ఆమెను బూతులు తిట్టి తన వెంట తెచ్చుకున్న కత్తితో దాడి చేసి తలపై, కుడిచేతిపై గాయపరిచాడు. ఈ మేరకు బాధితురాలు వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి కడప వన్‌టౌన్ ఎస్ఐ బి.మధుసూదనరెడ్డి విచారణ చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసు విషయమై బుధవారం కడప అడిష నల్ ఏఎస్‌జె కోర్టు జడ్జి నిందితుడికి ఐదేళ్ల సాధారణ జైలు శిక్ష, రూ.70 వేలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు. కాగా సాక్ష్యాధారాలతో నిందితుడికి శిక్షపడేలా చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ అభినందించారు.

రాళ్లదాడిలో యువకుడు మృతి

చక్రాయపేట, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సురభి గ్రామం కోమటిపేటకు చెందిన కందుల చంటి (30) అనే యువకుడిపై సురభి హరిజనవాడకు చెందిన ముగ్గురు వ్యక్తులు మంగళవారం రాత్రి రాళ్లతో దాడి చేయడంతో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా... కోమటిపేటకు చెందిన కందుల చంటి సురభిహరిజన వాడకు చెందిన దర్శనమ్మతో చనువుగా ఉండటం చూసి రమణ, కుమార్, ఈశ్వరయ్యలు ఓర్వలేకపోయారు. ముగ్గురు కలసి చంటిని చంపాలని పథకం పన్నారు. ఈ నేపథ్యంలో చంటి ప్రతి నిత్యం ట్రాక్టర్‌తో బొగ్గుల బట్టీల కోసం వేంపల్లె వైపు కట్టెలు తోలుతూ ఉంటాడు. మంగళవారం రాత్రి కట్టెలు విడిచి తిరిగి వస్తుండగా దేవరగుట్టపల్లె సమీపాన రమణ, కుమార్, ఈశ్వరయ్య రాళ్లతో దాడి చేయగా చంటి అక్కడే పడిపోయాడు. గమనించిన గ్రామస్తులు వారి బంధువులకు ఫోన్ ద్వారా తెలపడంతో హుటాహుటిన వచ్చి వేంపల్లెకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కడప రిమ్స్‌కు తరలించగా మృతి చెందాడు. ముగ్గురిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

విధులకు వెళ్తున్నానని చెప్పి ఆర్మీ ఉద్యోగి అదృశ్యం



నాగార్జునరెడ్డి (ఫైల్)

కలసపాడు, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముదిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన బైరెడ్డి నాగార్జునరెడ్డి అనే ఆర్మీ ఉద్యోగి గత నెల 1న విధులకు వెళ్తున్నట్లు చెప్పి అదృశ్యమయ్యాడు. ఉత్తరాఖండ్ రాష్ట్ర రేంజ్ ఆర్మీ ఆఫీసులో విధులు నిర్వహిస్తున్న అతను సెలవుపై ఫిబ్రవరి నెలలో తన స్వగ్రామమైన ముదిరెడ్డిపల్లెకు వచ్చాడు. సెలవుల అనంతరం ఏప్రిల్ 1న తిరిగి విధులకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లాడు. మీ అబ్బాయి విధులకు రాలేదని పనిచేస్తున్న ప్రాంతం నుంచి అధికారులు ఫోన్ చేయడంతో ఎక్కడికి వెళ్లాడోనని తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలైంది. తండ్రి నారాయణరెడ్డి ఫిర్యాదు మేరకు కలసపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తప్పిన ప్రమాదం

సీకేదిన్నె, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆజాద్‌నగర్ వద్ద ఊటుకూరు సర్కిల్ వైపు వరిగడ్డితో వస్తున్న ట్రాక్టర్‌ను వెనుకవైపు నుంచి టిప్పర్ ఢీకొనడంతో ట్రాక్టర్ పల్టీకొట్టింది. దీంతో వరిగడ్డి రోడ్డుపై పడిపోయింది. అయితే ఈ ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్, టిప్పర్ డ్రైవర్‌కు ఎటువంటి గాయాలు కాలేదు.

ఉపాధి పథకంలో అక్రమాలు, అవినీతి

● కలెక్టర్‌కు లేఖ రాసిన ఎంపీ అవినాష్‌రెడ్డి

పులివెందుల, మే 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథ కంలో భారీ అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆరోపించారు. జిల్లాలో ఉపాధి పనుల్లో జరుగుతున్న అవకతవకలపై కలెక్టర్ శ్రీధర్ చెరుకూరికి ఎంపీ లేఖ రాశారు. అందులో ఒకే ఫొటోతో అనేక పేర్లతో అప్‌లోడ్ చేస్తున్నారన్నారు. ఎప్పుడు అమలు చేయని పనులకు నకిలీ పత్రాల ఆధారంగా వేతన చెల్లింపులు జరిగాయన్నారు. అలాగే విదేశాలలో నివసిస్తున్న వారి పేర్లు కూడా మస్టర్‌లో చేర్చడం, పని జరగకున్నా, ఖాళీ మస్టర్‌లలో సంతకం చేయాలని కార్మికులను బలవంత పెడుతున్నారన్నారు. పులివెందుల నియోజక వర్గంలోని చక్రాయపేట మండలంలోని కుప్పం పంచాయతీలో నకిలీ ఎంట్రీలు, ఒకే కార్మికుడి ఫొటోలను పదేపదే ఉపయోగించారన్నారు. జిలాస్థాయి విచారణను ప్రారంభించాలని, రాజకీయ బలంతో అవినీతికి పాల్పడుతున్న ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

డీఆర్‌డీఏ పీడీ బాధ్యతలు స్వీకరణ



కడప ఎన్జీఆర్ సర్కిల్, మే 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామీణా భివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ పీడీ)గా డాక్టర్ రాజ్యలక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పూర్వపు పీడీ ఆనంద్‌నాయక్ ఆమెకు బాధ్యతలు అప్పగించారు. ఆనందనాయక్ పదోన్నతిపై తన మాతృశాఖకు బదిలీ అయిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఇన్‌చార్జ్ పీడీగా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మిని నియమించారు. దీంతో ఆమె బాధ్యతలను స్వీకరించారు. ఏపీడీ ప్రసాద్, సిబ్బంది నూతన పీడీకి ఘన స్వాగతం పలికారు.

ఆర్టీపీపీ సీఈగా వాసుదేవరావు



ఆర్టీపీపీ సీఈకి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్ఈలు

ఎర్రగుంట్ల, మే 14(ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎంవీఆర్ఆర్ ఆర్టీపీపీ చీఫ్ ఇంజినీర్‌గా జి.వాసుదేవరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. సీఈగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు స్థానిక ఎస్ఈలు సోమశేఖర్‌రెడ్డి, క్రిష్ణమోహన్, ఇతర అధికారులు, యూనియన్ నాయకులు, ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న గౌరీపతి విద్యుత్ సౌధకు బదిలీపై వెళ్లారు. కొత్త సీఈకి స్వాగతం, పాత సీఈకి వీడ్కోలు తెలుపుతూ సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు అధికారులు, ఉద్యోగులు ప్రసంగించారు.

గండికోట ప్రాజెక్టులో తగ్గుతున్న నీటిమట్టం

కొండాపురం, మే 14 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టులో నీటిమట్టం రోజురోజుకూ తగ్గుతూ వస్తోంది. ఎండాకాలం కావడం, ప్రాజెక్టు నుంచి అనుబంధ రిజర్వాయర్లకు నీరు విడు దల చేస్తుండటంతో నీటిమట్టం తగ్గుతోంది. ప్రస్తుతం జీఎన్ఎస్ఎస్ ప్రధాన కాలువ ద్వారా 200 క్యూసెక్కులు, తాగునీటి స్కీమ్‌కు 20 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో ఏమీ లేదన్నారు. గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 26.85 టీఎంసీలు కాగా ప్రస్తుతం 17.58 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు.

కడప-బెంగళూరు నూతన బ్రాడ్‌గేజ్ పనులను పునఃప్రారంభించాలి

వేంపల్లె, మే 14 (ఆంధ్రజ్యోతి): కడప-రాయచోటి-మదనపల్లె-బెంగుళూరు నూతన బ్రాడ్‌గేజ్ పనులను రైల్వేశాఖ వెంటనే పునఃప్రారంభించేటట్లు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి కోరారు. రైల్వేలైన్ విషయంపై తులసిరెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు బుధవారం బహిరంగ లేఖ రాశారు. 2008-09లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నూతన బ్రాడ్ గేజ్ రైలు మార్గాన్ని మంజూరు చేసిందన్నారు. మొదటిదశలో కడప నుంచి పెండ్లిమర్రి వరకు 21.80 కిలోమీటర్ల పని పూర్తి అయ్యిందన్నారు. 2019లో వైసీపీ అధికారం వచ్చాక పనులు చేపట్టలేదన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పునరాలోచించి కడప-బెంగుళూరు నూతన బ్రాడ్‌గేజ్ రైలు మార్గానికి రాష్ట్ర ప్రభుత్వ వాటాగా ఇవ్వాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

బద్వేలు మున్సిపాలిటీ అక్రమాల్లో 8 మందిపై విచారణ

కలికిరి, మే 14 (ఆంధ్రజ్యోతి): బద్వేలు మున్సిపాలిటీలో ఐదుగురు ఇంజినీర్లతోపాటు మరో ముగ్గురు అధికారులపై విచారణకు ఆదేశిస్తూ ప్రభుత్వం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. అనంతపురం సర్కిల్ ప్రజారోగ్య సూపరింటెండింగ్ ఇంజినీరు ఆర్.రామమోహన్ రెడ్డిని విచారణాధికారిగా నియమించగా ఆయన సహాయకారిగా అవసరమైన రికార్డులను సమకూర్చడానికి కడప ప్రజారోగ్య ఎక్జిక్యూటివ్ ఇంజినీరును నియమించింది. బద్వేలు మున్సిపాలిటీలో సమగ్ర తాగునీటి సరఫరా అభివృద్ధి పనుల్లో చోటు చేసుకున్న అనేక అక్రమాలు, అవకతవలపై విజిలెన్స్ విచారణ చేపట్టి 2023 డిసెంబరు 5న ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. ఈ అక్రమాల్లో బద్వేలు మున్సిపాలిటీలో అప్పటి ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఆర్.నగేష్‌బాబు, డిప్యూటీ ఈఈ కె.గురప్ప యాదవ్, మరో డీఈఈ పి.తులసికుమార్, ఏఈ జి.వరప్రసాద్, టెక్నికల్ ఆఫీసర్ జి.రమేష్, డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ వేముల జ్యోతి, మరో డివిజనల్ అకౌంట్స్ ఆఫీసరు ఎల్.గోవిందనాయక్, రిటైర్డు ఈఈ డి.శివనాగేంద్రల భాగస్వామ్యం ఉన్నట్లు విజిలెన్స్ తేల్చింది. ఈ విచారణ మేరకు వీరందరినీ అక్రమాలకు బాధ్యులుగా నిర్ధారిస్తూ విచారణ జరగనుంది. ఈ మేరకు మున్సిపల్ వ్యవహారాలు, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు.

18న జాతీయస్థాయి బండలాగుడు పోటీలు

జమ్మలమడుగు, మే 14 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నారాపురం వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో 18వ తేదీ జాతీయస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 18వ తేదీ ఉదయం 7.30 గంటలకు న్యూ కేటగిరి విభాగంలో, 19వ తేదీ ఉదయం సీనియర్స్ విభాగం ఎడ్లకు బండలాగుడు పోటీలు ఉంటాయని తెలిపారు.

'ఆర్టీసీ ఉద్యోగులపై అధికారుల తీరుమారాలి'

కడప మారుతీనగర్, మే 14 (ఆంధ్రజ్యోతి): కడప ఆర్టీసీ డిపోలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులపై (కండక్టర్లు,డ్రైవర్లు) సంబంధిత డిపో అసిస్టెంట్ మేనేజర్, టీఐ-3 కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం పద్ధతిగా లేదని, తక్షణం తీరు మార్చుకోవాలని ఆర్టీసీ కడప డిపో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ కార్యదర్శి సగినాల శ్రీనివాసులు కోరారు. ఇందుకు నిరసనగా నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ కడప డిపో ఆధ్వర్యంలో బుధవారం ఉదయం తొలి సర్వీస్ నుంచి ఎర్ర బ్యాడ్జీలు ధరించి పలువురు ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు.

పాలిసెట్, ఏపీఆర్జేసీ ఫలితాల్లో 'విశ్వం' విద్యార్థుల హవా

● ఏపీఆర్‌జేసీలో స్టేట్‌లో టాప్‌టెన్‌లో నాలుగుర్యాంకులు

● పాలిసెట్‌లో జిల్లాస్థాయిలో టాప్ ర్యాంకులు కైవసం

తిరుపతి(విద్య), మే14 (ఆంధ్రజ్యోతి): ఏపీప్రభుత్వం బుధవారం విడుదల చేసిన ఏపీ ఆర్జేసీ, పాలిసెట్ ఫలితాల్లో తమ వద్ద శిక్షణ పొందిన విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని తిరుపతిలోని 'విశ్వం' స్కూల్ చైర్మన్ డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. ఏపీఆర్‌జేసీలో ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో వై.దేదీప్యకు 3వర్యాంకు, కె.మునిరూపేష్‌కు 7వ, జె.అంజలికి 9వ, మనీషాకు 10వ ర్యాంకు వచ్చింద న్నారు. వీరితో పాటు రేవంత్, అబ్దుల్‌ఖాదర్, యోగి, సమత, దేదీప్య, భవ్య, శ్రీగీతిక, రోషన్, ట్వింకిల్, సంతోష్, భువన, కార్తికేయ అత్యుత్తమ ర్యాంకులతో ప్రతిభ చాటారన్నారు. పాలిసెట్‌లో ఎం.కావ్యశ్రీ 120కి117మార్కులతో బాలికలవిభాగంలో జిల్లాలో టాపర్‌గా నిలచిందని ఆయన తెలిపారు. కిమ్యశ్రీ 116, కె.నిత్యశ్రీ 114, అబ్దుల్‌ఖాదర్ 113, సుజినిరెడ్డి, చాతుర్య రాజకుమారి 112, ఎన్.రోషన్ 111, చేతన్‌రెడ్డి 110, జస్మిత 109 మార్కులతో ప్రతిభ చాటారన్నారు. సైనిక్, నవోదయ, మిలటరీస్కూల్ ప్రవేశ పరీక్షలతోపాటు ఏపీఆర్‌జేసీ, పాలిసెట్‌లోనూ తమ విద్యార్థులు ఏటా టాప్‌ర్యాంకులు సాధిస్తుండడం సంతోషంగా ఉందన్నారు. పోటీ పరీక్షల సమాచారం కోసం 8688888803/02, 9399976999 నెంబర్లలో సంప్రదించాలని కోరారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కరస్పాండెంట్ ఎన్.తులసివిశ్వనాథ్, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, విశ్వశ్రీ, టీచర్లు అభినందించారు.



ఏపీఆర్‌జేసీ టాపర్లను అభినందిస్తున్న విశ్వనాథరెడ్డి, విశ్వచందన్‌రెడ్డి

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
తిరుపతి - 9703618708, 9030367786, 9703618705, 9703618710, 9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లి - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

CHANGE OF NAME
I, KATIKALA NIHAL DAVID S/o KATIKALA JOHN PRIYAVADHAN, R/at DNo:2-282-3, Society Colony, Madanapalle T&M, Annamayya Dist, AP, herewith declared that my daughter earlier name was KATIKALA NIANA GRACE DAVID and date of birth is 31-10-2020. I further submit that I intended to change my minor daughter name as NIANA GRACE DAVID.
AJT - 200886

CHANGE OF NAME
I, G.R. VENKATA VARA PRASAD BABU S/o JAYACHANDRAIAH G R/o: D.No.3-86, Srinivasa Mangapuram, Chandragiri Mandal, Narasinga Puram, Mangapuram, Tirupati Urban-517102, Tirupati District, A.P. I have changed my name as V VARAPRASAD BABU G.R Son of JAYACHANDRAIAH G.
AJT - X

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర:7382114647.
AJA- 237544

WANTED
మీరు 10th క్లాస్ పాస్ అయి ఉన్నారా! ఆయితే ఎల్ఐసి ఏజెంట్‌షిప్ (జీతం + కమీషన్) కొరకు సంప్రదించండి. AKCS రెడ్డి, LIC of India, Tirupati. Cell:90599 19948
AJT - 1221

పాఠకులకు ముఖ్యగమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా పన్నించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : విజిలెన్స్


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్పీడీసీఎల్ విజిలెన్స్ పోలీసులు

మదనపల్లెటౌన్, మే 14(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలని ఎస్పీడీసీఎల్ విజిలెన్స్ పోలీసులు అవగాహన కల్పించారు. బుధవారం పట్టణ శివారులోని చంద్రాకాలని వద్ద విజిలెన్స్ ఇన్స్‌పెక్టర్ సుబ్రమణ్యంరెడ్డి మాట్లాడుతూ ఎస్పీడీసీఎల్ విజిలెన్స్ అడిషనల్ ఎస్పీ జనార్థన్‌నాయుడు ఆదేశాలతో మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ముఖ్యంగా రోజువారి పనుల్లో నిమగ్నమైన మహిళలు, పిల్లలు, రైతులు, వాహనదారులు తరచూ విద్యుత్ ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. విద్యుత్‌తీగలకు దూరంగా వుండాలని, విద్యుత్ పరికరాలు ఉపయోగించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. విద్యుత్ సరఫరా సంబంధిత సమస్యలు, అనుమానాలు వుంటే వెంటనే ఎస్పీడీసీఎల్ అధికారులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో విజిలెన్స్ కానిస్టేబుల్ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

నవోదయం-2 పథకంపై విస్తృత ప్రచారం



పట్టణంలోని అనిబీసెంట్ సర్కిల్ వద్ద ఎక్సైజ్ అధికారులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీబ్యానర్

మదనపల్లెటౌన్, మే 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న నవోదయం-2 పథకంపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నామని మదనపల్లె ఎక్సైజ్ సీఐ భీమలింగ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని పలు సర్కిళ్ల వద్ద ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో ఫ్లెక్సీ బ్యానర్లను ఏర్పాటు చేశారు. సీఐ మాట్లాడుతూ నాటుసారా తయారు చేస్తున్న గ్రామాల్లో ప్రజలకు నవోదయం-2 పథకం గురించి వివరిస్తున్నామన్నారు. నాటుసారా తయారీ మానుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయంతో ఉపాధి అవకాశాలు పెంచుకోవాలన్నారు. నాటుసారా తాగితే కలిగే దుష్ప్రభావాలను వివరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ డోర్కాస్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

నూతన ఎంపీడీవోగా క్రిష్ణవేణి


ఎంపీడీవో క్రిష్ణవేణి

బి.కొత్తకోట, మే 14(ఆంధ్రజ్యోతి): మండల నూతన ఎంపీడీవోగా క్రిష్ణవేణి బుధవారం బాధ్యతలు చేపట్టారు. పుంగనూరు నియోజకవర్గం చౌడేపల్లె మండల కార్యాలయంలో ఈవోఆర్డీగా పనిచేస్తున్న ఈమెను బి.కొత్తకోట మండల ఎంపీడీవోగా ఎఫ్ఏసీ ఇస్తూ చిత్తూరు కలెక్టర్ కార్యాలయం నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. దీంతో ఆమె బి.కొత్తకోట చేరుకొని బాధ్యతలు చేపట్టారు. ఇంతకాలం ఇక్కడ పనిచేసిన దిలీప్‌కుమార్ పదోన్నతిపై తిరుపతి జిల్లాకు బదిలీ అయ్యారు. కాగా విధుల్లో చేరిన తొలి రోజునే పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించి, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె విలేఖరులతో మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు.

ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి : డీఈ

పీలేరురూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని హౌసింగ్ డీఈ రమణయ్య తెలిపారు. బుధవారం పీలేరు మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ ప్రభుత్వం అడ్వాన్స్ పేమెంట్ చెల్లించిన లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. విధి నిర్వహణలో ఎవరైనా అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో శివశంకర్ పాల్గొన్నారు.

'టీడీపీ బలోపేతానికి కృషి చేద్దాం'

తంబళ్లపల్లె, మే 14(ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో తంబళ్లపల్లె మండలంలో టీడీపీని మరింత బలోపేతం చేయడానికి అందరం ఐకమత్యంగా, శక్తివంచన లేకుండా కృషి చేద్దామని తంబళ్లపల్లె టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి అన్నారు. టీడీపీ ఇంచార్జి జయచంద్రారెడ్డి ఆదేశాల మేరకు బుధవారం తంబళ్లపల్లెలో టీడీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో పరుసతోపు, తంబళ్లపల్లె టీడీపీ నూతన గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తినాయుడు, క్లస్టర్ ఇంచార్జి బేరిశీన, సిద్దమ్మ, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

'డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి'

మదనపల్లె అర్బన్, మే 14(ఆంధ్రజ్యోతి): తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలంటూ బుధవారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ టీసీ పేరిట యాజమాన్యం కట్టాల్సిన పీఎఫ్, ఈఎస్ఐ వాటాను ఉద్యోగుల నుంచి మినహాయిస్తూ చట్టాన్ని ఉల్లంఘిస్తోందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా తమ దుర్భర పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని తగు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగేంద్ర, వాసు, శ్రీధర్, సాయికుమార్, నగేస్, హరికృష్ణ, శ్రీనివాస్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

మురళీనాయక్ మృతికి ఘన నివాళి

బి.కొత్తకోట, మే 14(ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో వీరమరణం పొందిన సత్యసాయి జిల్లా, గోరంట్ల మండలం, కళ్లి తాండాకు చెందిన మురళీనాయక్‌కు బి.కొత్తకోట జ్యోతిచౌక్‌లో ఘన నివాళులర్పించారు. మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు, హారతులిచ్చి సంతాపం ప్రకటించారు. మురళీనాయక్ అమర్‌రహే... భారత్‌మాతాకి జై అంటూ నినాదాలు చేశారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పట్టణంలోని వివిధ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం

నిమ్మనపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముష్టూరు పంచాయతీలో గల ప్రసన్న చెన్నకేశవస్వామి ఆలయంలో బుధవారం స్వామివారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. చెన్నకేశవస్వామికి, భూదేవి, శ్రీదేవి విగ్రహాలకు అభిషేకం, ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం గ్రామంలో ఊరేగింపు చేపట్టారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సమయపాలన పాటించాలి: ఎంపీడీవో

ములకలచెరువు, మే 14(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఎంపీడీవో హరినారాయణ పేర్కొన్నారు. మండలంలోని సోంపల్లె సచివాలయాన్ని బుధవారం తనిఖీ చేశారు. సచివాలయంలోని ఆధార్ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం చెత్తసేకరణ కేంద్రాలను పరిశీలించారు.

రైతుల పరిస్థితి అంతేనా...!

- ప్రభుత్వాలు మారినా.. బతుకులు మారడం లేదు


గుర్రంకొండ మార్కెట్ యార్డు

గుర్రంకొండ, మే 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినా సన్న, చిన్నకారు రైతుల పరిస్థితి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన ఉంది. ప్రభుత్వాలు మారిన ప్రతి సారి తమకు న్యాయం జరుగుతుందని భావించిన రైతులకు నిరాశే మిగులుతోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మార్కెట్ యార్డు చైర్మెన్లుగా అనామకులను నియమించారు. ఈ నేపథ్యంలో వారు రైతుల సమస్యలను గాలికి వదిలేసి తమకు పదవులిచ్చిన నాయకులకు భజనలు చేస్తూ పదవీకాలం పూర్తి చేశారు. దీంతో మార్కెట్ యార్డుల్లో వ్యాపారులు చైర్మన్, నాయకులు, అధికారులకు ముడుపులిస్తూ అవినీతి దారిలో పయనింపజేశారు. ఈ క్రమంలో వ్యాపారులు ఏం చేసినా అధికారులు, నాయకులు పట్టించుకోకపోవడంతో రైతులు తల్లడిల్లిపోయారు. రాష్ట్రంలో ఏడాది కిందట ఎన్నికలు జరగడం... వైసీపీ ప్రభుత్వాన్ని ఓటర్లు నడ్డివిరిచి పాతాళానికి తొక్కేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో రైతులు, ప్రజలు తమకు మంచి రోజులు వచ్చాయని సంబరపడ్డారు. కానీ వీరి ఆశలపై కొందరు నాయకులు, వ్యాపారులు నీళ్లుచల్లారు. ఐదేళ్లపాటు వైసీపీలో ఉన్న వ్యాపారులు... ఆ పార్టీ అధికారం కోల్పోగానే రాత్రికి రాత్రే జెండాలు మార్చేశారు. దీంతో అధికారులు, నాయకులు మళ్లీ వారికే మద్దతు పలుకుతుండడంతో ప్రజలు, రైతుల గొంతుల్లో వెలక్కాయ పడినట్లయింది. దీంతో జెండాలు మార్చే వ్యాపారులకు ఉన్న విలువ రైతులకు ఏ ప్రభుత్వం ఇవ్వడం లేదనే విమర్శలున్నాయి.

చైర్మన్ సార్.. మా గోడు పట్టించుకోండి

గుర్రంకొండ మార్కెట్ యార్డులో టమోటా రైతుల గోడును నూతన చైర్మన్ పట్టించుకొంటే బాగుండని రైతులు అనుకొంటున్నారు. వాల్మీకిపురం మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా ఎన్నికై రెండు నెలలు గడుస్తున్నా ఇంతవరకు గుర్రంకొండ మార్కెట్ యార్డు వైపు చూడలేదంటే ఆయనకు ఎంత శ్రద్ధ ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ మార్కెట్ యార్డులో ఏడాదిపాటు వ్యాపారాలు జరిగి కమిటీకి ఆదాయం చేకూరుతోంది. అలాంటి యార్డులో రైతుల కష్టాలు వినేందుకు కూడా నాయకులకు సమయం దొరక్కపోవడం దౌర్భాగ్యంగా రైతులు భావిస్తున్నారు.

రైతు సంఘాల నాయకులు ఎక్కడ..?

రైతుల సమస్యలను పరిష్కరించడానికి రైతు సంఘాలున్నాయి. ఈ సంఘాలకు కూడా జిల్లా, మండలాల వారీగా నాయకులున్నారు. ఈ రైతు సంఘం నాయకులు రైతుల సమస్యలను పరిష్కరించడానికి, గలమెత్తడానికి కూడా ముందుకు రావడం లేదు. వీరికి రైతుల సమస్యలు పట్టవా...? లేక వ్యాపారులకు కొమ్ముకాస్తున్న నాయకులను చూసి భయమో అర్థం కావడం లేదని రైతులు గుసగుసలాడుతున్నారు. అలాంటప్పుడు ఈ రాష్ట్ర, జిల్లా, మండల రైతు సంఘాలు ఎందుకని రైతులు నిలదీస్తున్నారు. ఇకనైనా రైతు సంఘాలు నాయకులు కల్పించుకొని గుర్రంకొండ మార్కెట్ యార్డులో రైతులను పట్టిపీడిస్తున్న జాక్‌పాట్, అధిక కమీషన్‌లపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

యుద్ధ ప్రాతిపదికన తాగునీటి సమస్య పరిష్కారం

- మదనపల్లె డీఎల్‌పీవో నాగరాజు


సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో నాగరాజు

పీలేరురూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా ఎక్కడైనా తాగునీటి సమస్య ఉత్పన్నమైతే యుద్ధ ప్రాతిపదికన పరిష్కరిస్తామని మదనపల్లె డీఎల్‌పీవో నాగరాజు తెలిపారు. బుధవారం పీలేరు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన డీఎల్‌పీవో మాట్లాడుతూ ఇప్పటి వరకు డివిజన్ పరిధిలో తంబళ్లపల్లె నియోజక వర్గంలో రెండు చోట్ల సమస్య ఉత్పన్నమైందని, వెంటనే పరిష్కరిస్తామన్నారు. తాగునీటి సమస్య ఉత్పన్నమైన పంచాయతీలలో కలెక్టర్ అనుమతితో ట్యాంకర్ల ద్వారా మంచి నీటి సరఫరా చేస్తున్నామని చెప్పారు. కొన్ని చోట్ల నీటి సరఫరాలో పలు సమస్యలు ఉత్పన్నమయ్యాయని తెలిపారు. ప్రతి 15 రోజులకు ఒక సారి రక్షిత మంచినీటి సరఫరా ట్యాంకులకు క్లోరినేషన్ విధిగా చేయాలని ఆదేశించారు. ఇంటి పన్ను వసూళ్లు మందకొడిగా సాగుతున్నాయని, ఇప్పటికే పలుమార్లు హెచ్చరించామని, ఎవరైనా నిర్లక్ష్య ధోరణి విడవకపోతే చర్యలు తప్పవన్నారు. పంచాయతీల పనితీరుపై డిప్యూటీ ఎంపీడీవోల పర్యవేక్షణ తప్పనిసరి అని, ఎప్పటికప్పుడు ప్రభుత్వం నుంచి వచ్చే వివరాలు సకాలంలో ఆన్‌లైన్ చేయించాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో మౌళిక వసతుల కల్పనతోపాటు శానిటేషన్, మంచి నీరు, వీధి దీపాల ఏర్పాటు, తదితర కార్యక్రమాలపై ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో శివశంకర్, డిప్యూటీ ఎంపీడీవో లతీఫ్‌ఖాన్, ఏవో రాజేశ్వరి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మెరుగైన సేవల కోసమే 'మనమిత్ర'

వాల్మీకిపురం, మే 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలకు సకాలంలో మెరుగైన సేవలు అందించడం కోసమే మనమిత్ర యాప్‌ను రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ పేర్కొన్నారు. వాల్మీకిపురం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం ఎంపీడీవో మనోహర్‌రాజుతో కలిసి మనమిత్ర యాప్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోవు రోజుల్లో ఈ యాప్ ద్వారా 400 ప్రభుత్వ సేవలు ఇంటి వద్ద నుంచే ప్రజలు పొందేలా ప్రత్యేకంగా పొందుపరిచారన్నారు. ప్రస్తుతం సుమారు 200 సేవల దాకా ప్రజలకు ఈ యాప్ ద్వారా సేవలు పొందేందుకు అవకాశం ఉందని తెలిపారు. సీఎం చంద్రబాబు, విద్యాశాఖా మంత్రి నారా లోకేష్‌లు రాష్ట్ర ప్రజల అభివృద్ధే ధ్యేయంగా నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నరేంద్రకుమార్‌రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జున రెడ్డి, ఈవోఆర్డీ సుధాకర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన గురుప్రసాద్


సీఎం చంద్రబాబుకు జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

మదనపల్లెటౌన్, మే 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విజయవాడలో నిర్వహించిన గ్లోబల్ ఫోరంలో సీఎం చంద్రబాబును మదనపల్లె విద్యావేత్త రాటకొండ గురుప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం విజయవాడలోని పార్చున్ మురళి ఫంక్షన్ హాల్లో గ్లోబల్ ఫోరం సంస్థ డైరెక్టర్, రిటైర్డ్ చీఫ్ సెక్రటరి ఠక్కర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సంస్థ చీఫ్ పాట్రన్‌గా వున్న సీఎం చంద్రబాబు ఆలోచనలను గురించి వివరించారు. ఈ మేధావుల సదస్సులో పాల్గొన్న గురుప్రసాద్ మాట్లాడుతూ నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహీంద్ర ఫ్లైడ్ క్లాస్‌రూమ్ విధానం గురించి వివరించారు. రాష్ట్రంలో యువతకు ఉపాధి కల్పించేందుకు ఈ విధానం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం సీఎం చంద్రబాబుకు గురుప్రసాద్ జ్ఞాపిక అందజేశారు.

రీసర్వే పక్కాగా చేయండి : ఆర్డీవో



ఇందిరమ్మ కాలనీలో ప్రభుత్వ భూములు పరిశీలిస్తున్న ఆర్డీవో

గుర్రంకొండ, మే 14(ఆంధ్రజ్యోతి): రైతుల భూముల రీసర్వేను పక్కాగా చేయాలని రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్ రెవెన్యూ సిబ్బందికి సూచించారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో రీసర్వేపై వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రీసర్వేను ప్రణాళిక ప్రకారం చేసి తప్పులు లేకుండా చేయాలని తెలిపారు. అలాగే ఫ్రీహోల్డ్ భూముల వివరాలను సరిచేయాలని సూచించారు. ఇందిరమ్మ కాలనీలో ప్రభుత్వ భవనాల నిర్మాణాల కోసం కేటాయించిన స్థలాలను పరిశీలించారు. అనంతరం పీజీఆర్ఎస్‌లో ప్రజలు ఇచ్చిన అర్జీలపై విచారించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల శాతాన్ని పెంచండి: ఏపీడీ

పెద్దతిప్పసముద్రం,మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో చేపడుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులలో కూలీల శాతాన్ని పెంచి ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని ఉపాధిహామీ ఏపీడీ నందకుమార్ ఉపాధిహామీ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆయన ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్‌తో కలిసి మండలంలోని పీటీఎం, రంగసముద్రం, రాపూరివాండ్లపల్లె, మడుమూరు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధి కూలీల మస్టర్లను పరిశీలించి కూలీల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఉపాధిహామీ పథకం ద్వారా రైతులు తమ పొలాల్లో ఉద్యాన పంటలతో పాటుగా గడ్డి పెంపకానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆయన వెంట ఉపాధిహామీ ఏపీవో తిరుపాలప్ప, ఈసీ సుధాకర్, టెక్నికల్ అసిస్టెంట్లు నారాయణ, శంకర, ఫీల్డ్ అసిస్టెంట్లు, శంకర, శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే వ్యాధుల నిర్మూలన


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

వాల్మీకిపురం, మే 14(ఆంధ్రజ్యోతి): మన చుట్టూ పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధులను నిర్మూలించవచ్చని చింతపర్తి వైద్యాధికారిణి జులేఖాబేగం పేర్కొన్నారు. బుధవారం మండలంలోని విఠలం గ్రామంలో చింతపర్తి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనారోగ్యాలకు దూరంగా ఉండాలంటే కలుషిత నీటికి దూరంగా ఉంటూ పరిశుభ్రమైన వాతావరణంతో పాటుగా వ్యక్తిగత పరిశుభ్రత కూడా పాటించాలన్నారు. మే నెల దృష్ట్యా ఎండలు తీవ్రంగా మండుతున్నాయని, ప్రజలు వేడిమి పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మహ్మద్‌రఫీ, వైద్య సిబ్బంది మంజునాథ్, అరుణ, సుధ, దుర్గ, నాగరత్న, నరసమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

అమ్మవారికి దీలు, బోనాలు


విశేష పూజలందుకుంటున్న శక్తిమాతా అమ్మవారు

వాల్మీకిపురం, మే 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామ్‌నగర్ ప్రాంతంలో వెలిసిన శక్తిమాత అమ్మవారి జాతర మహోత్సవాలను బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో అమ్మవారికి అభిషేకం, అర్చన, ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం మహిళలు దీలు, బోనాలతో మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లిస్తూ పూజలు చేశారు. సాయంత్రం విశేషాలంకరణలతో ముస్తాబైన శక్తిమాత అమ్మవారిని పుష్పపల్లకిపై అలంకరణ చేసి చాందినీ బండ్లు, భక్తజనం నడుమ నగరోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో అర్చకులు ఉత్తేజ్‌స్వామి, ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

వేడుకగా కొత్తపురమ్మ జాతర

కలకడ, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగుట్టపల్లె గ్రామదేవత కొత్తపురమ్మ జాతరను బుధవారం గ్రామస్థులు వేడుకగా జరుపుకొన్నారు. ఇందులో భాగంగా ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. అమ్మవారిని ప్రత్యేకంగా పూలతో అలంకరించి పూజలు చేశారు. మహిళలు భక్తి శ్రద్ధలతో బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకొన్నారు. సమీప గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

అందుబాటులోకి మరుగుదొడ్లు

బి.కొత్తకోట, మే 14(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట నగర పంచాయతీ పరిధిలోని జ్యోతిచౌక్‌లో నిర్మించిన నూతన మరుగుదొడ్లు బుధవారం నుంచి ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. దీర్ఘకాలిక కాంట్రాక్టు పద్ధతిన ప్రజా సౌకర్యార్థం నిర్మింపజేసిన మరుగుదొడ్ల సముదాయాన్ని నగరపంచాయతీ కమిషనర్ జీఆర్ పల్లవి తమ సిబ్బందితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో నగరపంచాయతీ సిబ్బందితో పాటు పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రభాకర్


ప్రభాకర్

ములకలచెరువు, మే 14(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా ప్రభాకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూల్ జిల్లా మిద్దుటూర్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న ఆయన్ను ఉన్నతాధికారులు ఇక్కడికి బదిలీ చేశారు. ఇక్కడ ఐదేళ్లుగా ఇన్‌చార్జి ప్రిన్సిపల్‌గా అల్తాఫ్‌బాను పనిచేస్తున్నారు. కొత్త ప్రిన్సిపల్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రభాకర్‌ను కళాశాల అధ్యాపకులు అభినందించారు.

మహిళ ఆత్మహత్యాయత్నం


ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన నాగమ్మ

రామసముద్రం, మే 14(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అధికారులు నిర్బంధంగా తన పొలంలో దారి ఏర్పాటు చేయడంతో ఓ మహిళ బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బాధిత మహిళ వివరాల మేరకు.. మండలంలోని మూగవాడి గ్రామంలో కాపురం ఉంటున్న నాగమ్మ(43)కు తన పూర్వీకుల నుంచి వచ్చిన 6 ఎకరాల పొలంలో బుధవారం రెవెన్యూ అధికారులు పక్కపొలం వారికి అనుకూలంగా రోడ్డు వేసేందుకు తమ నేలను కేటాయించారని మనస్తాపం చెందారు. దీంతో టమోటా పంటకు వాడే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు నాగమ్మను పుంగనూరు ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు.

అనారోగ్యంతో వీఆర్‌వో మృతి


వెంకటనారాయణ (ఫైల్)

ములకలచెరువు, మే 14(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు వీఆర్‌వోగా పనిచేస్తున్న వెంకటనారాయణ(55) మృతి చెందారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఈయన పరిస్థితి విషమించడంతో మంగళవారం రాత్రి చికిత్స నిమిత్తం తిరుపతి రూయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. కాగా మృతుడి భార్య భాగ్యమ్మ మూడేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. తాజాగా ఆయన కూడా మృతి చెందడంతో వీరి కుమార్తె భవాని, కుమారుడు చరణ్‌తేజ్ అనాథలయ్యారు. భవానీ డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతుండగా, చరణ్‌తేజ్ ఎనిమిదోవ తరగతి చదువుతున్నాడు. వెంకటనారాయణ మృతదేహాన్ని స్వగ్రామమైన కాలువపల్లెకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. మృతదేహం వద్ద తహసీల్దార్ ప్రదీప్, డీటీ లక్ష్మీ, వీఆర్‌వోలు నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కాగా మృతుడికి మూడేళ్లుగా జీతం రాకపోవడంతో చికిత్సకు, కుటుంబ పోషణకు డబ్బులు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డాడని, జీతం చెల్లించాలని రెవెన్యూ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని గ్రామస్థులు ఆరోపించడం విశేషం.

మాజీ ఎంపీపీ రహంతుల్లా మృతి


రహంతుల్లా (ఫైల్)

కలికిరి, మే 14 (ఆంధ్రజ్యోతి): మండల ప్రముఖ టీడీపీ నాయకుడు మాజీ ఎంపీపీ, మాజీ జడ్పీటీసీ సభ్యుడు పాలగిరి రహంతుల్లా (68) బుధవారం మృతి చెందాడు. శ్వాసకోస వ్యాధితో రెండు రోజుల క్రితం తిరుపతిలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటూ బుధవారం అకస్మాత్తుగా మరణించారు. ఆయన భౌతికకాయాన్ని తిరుపతి నుంచి సాయంత్రం కలికిరికి తరలించారు. ఈయన 2001-2006 వరకు కలికిరి జడ్పీటీసీ సభ్యుడిగా, 2006-2011 వరకు మండల పరిషత్ అధ్యక్షుడిగా పనిచేశారు. గత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కలికిరి సర్పంచుగా పోటీ చేసి ఓటమి చెందారు. స్థానిక జామియా పెద్ద మసీదు ముతవల్లీగా కూడా ఆయన సేవలందించారు. రహంతుల్లాకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. గురువారం స్థానిక కబరస్థాన్‌లో అంత్యక్రియలు జరగనున్నాయి.

ఆత్మీయుడిని కోల్పోయా: ఎమ్మెల్యే

తమ కుటుంబానికి అత్యంత ఆత్మీయుడిగా వున్న రహంతుల్లా మరణం దిగ్భ్రాంతికి గురిచేసిందని ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కుటుంబ సభ్యులను ఫోనులో పరామర్శించి ధైర్యంగా వుండాలని చెప్పారు. కాగా ఆయన హైదరాబాదు నుంచి బుధవారం రాత్రి కలికిరి చేరుకున్నారు. గురువారం భౌతిక కాయానికి నివాళులర్పించనున్నారు. కాగా మండలంలోని పలువురు ప్రముఖులు, పార్టీ నాయకులు రహంతుల్లా భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

కార్మికులకు మస్టర్ రోల్స్ అమలు చేయాలి


డీఎల్‌పీవోకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

పీలేరు, మే 14(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు మస్టర్ రోల్స్ విధానం అమలు చేయాలని ఏపీ గ్రామ పంచాయతీ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ధనాశి వెంకటరామయ్య డిమాండ్ చేశారు. పీలేరు గ్రామ పంచాయతీని బుధవారం మదనపల్లె డీఎల్‌పీవో నాగరాజు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వెంకటరామయ్య ఆయనకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు బీవీ రమణ, ఓబులయ్య, నాగార్జున పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో బండెమ్మ తిరునాళ్లు

రామసముద్రం, మే 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎలకపల్లె పంచాయతీ కేంద్రంలో వెలసి ఉన్న గ్రామ దేవత బండెమ్మ తిరునాళ్లు బుధవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి దీలు మోసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.